తెలుగు దినపత్రిక
RNI TG TEL/ 26/A0381
# సిరి
People's Voice
వార్త పత్రిక
29-09-2026
మంగళవారం హైదరాబాద్
సంపుటి: (volume): 1
సంచిక: (ISSUE): 231
PUBLISHED FROM HYDERABAD
పేజీలు-8 వెల:రూ.4 /–

తెలుగు దినపత్రిక
సిరి
People's Voice
RNI:TGTEL/26/A0381
siridailynews@gmail.com
/siridailynews
@siridailynews
విలేకరులు కావలెను
ఉన్నత ఆశయంతో ముందుకు పోతున్న సిరి దినపత్రిక లో తెలంగాణలోని అన్ని జిల్లా కేంద్రాలకు
స్టాఫ్ రిపోర్టర్స్ తో పాటు, అన్ని జిల్లాలోని నియోజకవర్గ కేంద్రాలకు మరియు మండలాలకు విలేకరులు కావలెను.
99897 78881, 7702344303, 9440451575



## సిరిసిల్లకు సీఎం వరాలు..

- రూ.345.78 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం
- భారీ బహిరంగ సభలో ప్రజలనుద్దేశించి ప్రసంగం
- నేతన్నలకు 'నేతన్న బజార్'.. మహిళా శక్తి భవనం ప్రారంభం
- రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు
- రాజన్న ఆలయ అభివృద్ధికి రూ.99.40 కోట్లు
- కొత్త ఆర్డీఓ, తహసీల్దార్, పోలీస్ కార్యాలయాలకు శంకుస్థాపనలు

**హైదరాబాద్, సిరి న్యూస్, సెప్టెంబర్ 28:** ముఖ్యమంత్రి హోదాలో ఎన్. రేవంత్‌రెడ్డి తొలిసారిగా ఈ నెల 30న రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో పర్యటించనున్నారు. గతంలో ప్రతిపక్ష నేతగా మూడుసార్లు సిరిసిల్లలో పర్యటించిన ఆయన.. ఇప్పుడు ముఖ్యమంత్రిగా జిల్లా అభివృద్ధికి రూ.345.78 కోట్ల విలువైన పలు కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. సిరిసిల్ల రగుడు బైపాస్ సమీపంలో నిర్వహించే భారీ బహిరంగ సభలో సీఎం పాల్గొని ప్రజలనుద్దేశించి ప్రసంగించనున్నారు. నేతన్నల సంక్షేమం, మహిళా సాధికారత, విద్య, మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యమిస్తూ ప్రభుత్వం

మిగతా 2వ పేజీలో..

## ఉత్తర, దక్షిణ భారత రాజకీయ శైలి వేరు

- తెలంగాణలో విద్యార్థి సంఘాలు తక్కువ
- నేను ఏపార్టీలో వున్నా రాష్ట్రంకోసమే పనిచేస్తా
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



2

## ఈషాసింగ్‌కు సీఎం అభినందనలు

2




# నిధులు కోట్లల్లో.. పనులు లక్షల్లో!

### కొన్నిటికి హంగులు.. కొన్నిచోట్ల అసలే పడని రంగులు

- జూనియర్ కళాశాలల మరమ్మతుల్లో జాప్యం
- 326 జూనియర్ కళాశాలలకు రూ.56.16 కోట్ల నిధులు మంజూరు
- నిధులు విడుదల చేసి ఏడాది గడుస్తున్నా నత్తనడకన పనులు
- తాగునీరు, విద్యుత్, శానిటేషన్ లేక విద్యార్థుల తీవ్ర అవస్థలు
- కాంట్రాక్టర్ల అవతారమెత్తిన స్థానిక నాయకులు
- కొరవడిన నాణ్యతా ప్రమాణాలు
- నాణ్యత లోపిస్తే రికవరీల భయం.. తప్పకుంటున్న సీనియర్ ప్రిన్సిపాళ్లు

**తెలంగాణ బ్యూరో, సిరి న్యూస్:** తెలంగాణలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల రూపురేఖలు మార్చి, పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి మౌలిక వసతులు కల్పించాలన్న ప్రభుత్వ సంకల్పం క్షేత్రస్థాయిలో తీవ్ర నిర్లక్ష్యానికి గురవుతోంది. కనీస సదుపాయాలు లేక విద్యార్థులు పడుతున్న గోసను గుర్తించి సర్కారు కోట్లాది రూపాయల నిధులను కేటాయించినప్పటికీ, వాటిని సద్వినియోగం చేయడంలో అధికార యంత్రాంగం ఉదాసీనత ప్రదర్శిస్తోంది. కొన్ని కళాశాలల్లో పనుల పేరిట రంగులద్దే హడావుడి సాగుతుండగా, అనేక చోట్ల కనీసం పనులు ప్రారంభం కాక భవనాలు శిథిలావస్థలోనే మూలుగుతున్నాయి. నిధులు విడుదలై ఏడాది కావస్తున్నా పనుల్లో పురోగతి కనిపించకపోవడం గ్రామీణ, పట్టణ ప్రాంత విద్యార్థులకు శాపంగా మారింది.

**ఏడాది గడిచినా అందని పురోగతి**

రాష్ట్రంలో నాణ్యమైన విద్యాబోధనతో పాటు విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు, నాణ్యమైన విద్యుత్, సక్రమమైన మరుగుదొడ్లు, మురుగునీటి పారుదల వ్యవస్థలను మెరుగుపరచడం అత్యంత ఆవశ్యకం. ఈ నేపథ్యంలోనే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 326 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రాథమిక సదుపాయాల కల్పనకు ఇంటర్ బోర్డు గత ఏడాది సెప్టెంబరులోనే రూ.56.16 కోట్ల భారీ నిధులను విడుదల చేసింది. స్థానిక అవసరాల ప్రాతిపదికన ఎస్టిమేట్లు వేసి అత్యవసర పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ప్రభుత్వం స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసింది. అయితే పాలకులు, అధికారుల మధ్య లోపించిన సమన్వయంతో పాటు కొన్నిచోట్ల రాజకీయ నాయకుల జోక్యం పెరిగిపోవడంతో పనులు నత్తనడకన సాగుతున్నాయి.



మిగతా 2వ పేజీలో..



## భూసమస్య పరిష్కారానికి రీసర్వే ఏకైక మార్గం

- ప్రతి జిల్లాలో 70 రెవెన్యూ గ్రామాల్లో తొలి దశ సర్వే
- నక్షాలు లేని మరో 413 గ్రామాల్లోనూ సమగ్ర భూసర్వే
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి

**వనపర్తి / హైదరాబాద్, సిరి న్యూస్, సెప్టెంబర్ 28:** రాష్ట్రంలో భూసమస్యల శాశ్వత పరిష్కారానికి భూసర్వే ఏకైక పరిష్కారమార్గమని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మార్గనిర్దేశం ప్రకారం భూ సమస్యలకు సంబంధించి దీర్ఘకాలిక సమస్యల్లో కొన్నింటిని ఇప్పటికే పరిష్కరించామని త్వరలో మరికొన్నింటికి

మిగతా 3వ పేజీలో..

## నిరసనలకు అడ్డాగా సచివాలయం



- ఈ పరిస్థితి రావడం సిగ్గుచేటు: హరీష్‌రావు

**హైదరాబాద్, సిరి న్యూస్, సెప్టెంబర్ 28 :** పరిపాలనకు కేంద్రంగా ఉండాల్సిన సచివాలయం కాంగ్రెస్ పాలనలో నిరసనలకు అడ్డాగా మారడం సిగ్గుచేటు అని బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ టి.హరీష్‌రావు ఒక ప్రకటనలో విమర్శించారు. రిటైర్డ్ ఉద్యోగులు, కాంట్రాక్టర్లు సచివాలయం వేదికగా ఆందోళనకు దిగాల్సిన దుస్థితి రావడం సీఎం రేవంత్ రెడ్డి, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క తలదించుకోవాల్సిన విషయం అని అన్నారు. ఏళ్లతరబడి బిల్లులు పెండింగ్‌లో పెట్టి ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోకుండా ఇంకెంత కాలం

మిగతా 3వ పేజీలో..




2

## సర్వర్ డౌన్

- వారం రోజులుగా రవాణాశాఖలో నిలిచిన ఆన్‌లైన్ సేవలు
- నిమిషం పనికి రోజంతా పడిగాపులు
- వాహన రిజిస్ట్రేషన్లు, బదిలీలు, లైసెన్సులు అందక వాహనదారుల బేజారు
- మళ్లీ కార్యాలయాల గడప తొక్కుతున్న జనం
- ప్రజల ఆగ్రహాన్ని భరించలేక మానసిక ఒత్తిడిలో సిబ్బంది

## హైదరాబాద్‌లో 'బిల్ట్రస్ట్' జీసీసీ ఏర్పాటు

- రూ.450 కోట్ల పెట్టుబడి. వేయిమందికి ఉద్యోగాలు
- లాంఛనంగా ప్రారంభించిన ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల

**హైదరాబాద్, సిరి న్యూస్:** జాతీయ, అంతర్జాతీయ దిగ్గజ సంస్థలు తమ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల (జీసీసీ) ఏర్పాటుకు హైదరాబాద్‌ను తమ గమ్యస్థానంగా

మిగతా 3వ పేజీలో..






## రాహుల్ హెచ్చరికలు నిజమని తేలాయి

- సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి
- టీపీసీసీ ఆధ్వర్యంలో సీఈవో కార్యాలయం ముందు నిరసన
- ప్రధాన ఎన్నికల అధికారికి భట్టి వినతిపత్రం సమర్పణ

2

## ఓటు చోరీకి తెరపడితే బీజేపీ పాలనకూ తెరపడ్డట్టే

- ప్రజాస్వామ్య పరిరక్షణ పోరాటాన్ని నడిపిస్తున్న రాహుల్
- నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్

3





## ఖైరతాబాద్ ఉప ఎన్నికకు లైన్ క్లియర్

**హైదరాబాద్, సిరి న్యూస్, సెప్టెంబర్ 28:**

ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఉప ఎన్నికకు మార్గం సుగమమైంది. బీఆర్ఎస్ అభ్యర్థిగా గెలిచిన దానం నాగేందర్‌పై అనర్హత వేటు పడటంతో ఖైరతాబాద్ స్థానం ఖాళీ అయినట్లు తెలంగాణ శాసనసభ సచివాలయం అధికారికంగా గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. 2024 ఏప్రిల్ 23 నుంచే ఆయన అనర్హత అమల్లోకి వచ్చినట్లు, అదే తేదీ నుంచి ఖైరతాబాద్ స్థానం ఖాళీ అయినట్లు అందులో పేర్కొంది.

2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఖైరతాబాద్ నుంచి బీఆర్ఎస్ తరఫున దానం నాగేందర్ విజయం సాధించారు. అనంతరం కాంగ్రెస్‌లో చేరిన ఆయన 2024 లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ నుంచి ఆ పార్టీ అభ్యర్థిగా పోటీ చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా కొనసాగుతూనే కాంగ్రెస్ అభ్యర్థిగా లోక్‌సభ బరిలో నిలవడాన్ని పరిగణనలోకి తీసుకున్న తెలంగాణ హైకోర్టు.. రాజ్యాంగంలోని పదో షెడ్యూల్ కింద ఆయనను అనర్హుడిగా ప్రకటించింది. కాంగ్రెస్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన 2024 ఏప్రిల్ 23 నుంచే అనర్హత వర్తిస్తుందని సెప్టెంబర్ 18న తీర్పు ఇచ్చింది.

సుప్రీంలోనూ దానంకు ఎదురుదెబ్బ హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ దానం నాగేందర్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అయితే హైకోర్టు నిర్ణయంలో జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేదని పేర్కొంటూ సుప్రీంకోర్టు సెప్టెంబర్ 24న ఆయన పిటిషన్‌ను కొట్టివేసింది. దీంతో దానం అనర్హత ఖరారైంది.

గెజిట్‌తో అధికారికంగా ఖాళీ కోర్టు తీర్పుల నేపథ్యంలో శాసనసభ కార్యదర్శి రెండ్ల తిరుపతి సెప్టెంబర్ 26న గెజిట్ నోటిఫికేషన్ జారీ చేశారు. దానం నాగేందర్ 2024 ఏప్రిల్ 23 నుంచి ఎమ్మెల్యేగా అనర్హుడయ్యారని, అదే తేదీ నుంచి ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీగా పరిగణిస్తున్నట్లు అందులో పేర్కొన్నారు. దీంతో ఇప్పుడు తదుపరి ప్రక్రియ ఎన్నికల సంఘం పరిధిలోకి వెళ్లనుంది. ఖైరతాబాద్ ఉప ఎన్నికకు సంబంధించిన షెడ్యూల్‌ను ఎన్నికల సంఘం ప్రకటించాల్సి ఉంది. రాష్ట్ర రాజధాని నడిబొడ్డున ఉన్న కీలక నియోజకవర్గం కావడంతో ఉప ఎన్నిక ప్రకటన వెలువడితే ప్రధాన పార్టీల మధ్య రాజకీయ పోరు మరింత వేడెక్కనుంది.

## ఈషాసింగ్‌కు సీఎం అభినందనలు

**హైదరాబాద్ , సిరి న్యూస్ సెప్టెంబర్ 28 :**



జపాన్‌లో జరుగుతున్న 2026 ఆసియా క్రీడల్లో మహిళల 25 మీటర్ల పిస్టల్ వ్యక్తిగత విభాగంలో భారత స్టార్ షూటర్, తెలంగాణ ముద్దుబిడ్డ హైదరాబాద్ నగరానికి చెందిన ఈషా సింగ్ వెండి పతకం సాధించడం పట్ల ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఐదుసార్లు షూటఆఫ్స్‌లో ఒత్తిడిని ధైర్యంగా ఎదుర్కొని స్వల్ప తేడాతో బంగారు పతకాన్ని కోల్పోయినా ఆమె ప్రదర్శన అద్భుతమని ప్రశంసించారు. ఈషా సింగ్ పోరాట స్ఫూర్తి క్రీడాలోకానికి ఆదర్శనీయమని అన్నారు. భవిష్యత్తులో అంతర్జాతీయ వేదికలపై మరెన్నో గొప్ప విజయాలు అందుకుని దేశ ప్రతిష్ఠను, తెలంగాణ కీర్తిని చాటాలని రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు.



## నవంబర్ నుంచి 'రాజీవ్ యువ వికాసం'

**హైదరాబాద్ , సిరి న్యూస్ సెప్టెంబర్ 28**

సంక్షేమ శాఖపై సోమవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటికే ఈ పథకానికి స్వీకరించిన దరఖాస్తులను జిల్లా కలెక్టర్ల సమక్షంలో పారదర్శకంగా పరిశీలించి లబ్దిదారులను ఎంపిక చేయాలని అధికారులను ఆదేశించారు. ఎంజేపీ (మహాత్మా జ్యోతిబా పూలే) గురుకులాల్లో ఉన్న పెండింగ్ బిల్లులను త్వరలోనే క్లియర్ చేస్తామని హామీ ఇచ్చారు. గురుకుల విద్యాలయాలకు సొంత భవనాలు మంజూరు చేయాలని సమావేశంలో పాల్గొన్న బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేయగా ఆ అంశాన్ని పరిశీలిస్తామని భట్టి విక్రమార్క తెలిపారు. ఈ ఏడాది ఓవర్సీస్ స్కాలర్‌షిప్ పథకం కింద మొదటి, రెండవ విడతలుగా 180 మంది విద్యార్థులకు రూ.18 కోట్ల 40 లక్షలను విడుదల చేశామని చెప్పారు. ఓవర్సీస్ స్కాలర్‌షిప్ దరఖాస్తు గడువును అక్టోబర్ 15 వరకు పొడిగిస్తున్నట్లు ప్రకటించారు. అదేవిధంగా బీసీ కుల సంఘాల ఆత్మగౌరవ భవనాల నిర్మాణానికి కూడా త్వరలోనే నిధులు విడుదల చేస్తామని డిప్యూటీ సీఎం హామీ ఇచ్చారు. రాష్ట్రంలో బీసీ సంక్షేమ పథకాల అమలుకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత నిస్తోందని స్పష్టం చేశారు. సంక్షేమ ఫలాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రీమెట్రిక్, పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్ నిధులను నేరుగా విద్యార్థుల బ్యాంకు ఖాతాల్లోకే(డీబీటీ పద్ధతి ద్వారా) జమ చేస్తున్నట్లు డిప్యూటీ సీఎం వెల్లడించారు. ఈ నూతన విధానం ద్వారా ఇప్పటివరకు 1,30,000 మంది విద్యార్థులకు రూ.450 కోట్లను వారి ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. అలాగే హాస్టల్ విద్యార్థుల డైట్, కాస్మెటిక్ చార్జీలను సైతం ఏ నెలకు ఆ నెల ఖచ్చితంగా విద్యార్థుల ఖాతాల్లోనే జమ చేయాలని అధికారులను ఆదేశించారు.

**రూ.60 కోట్లతో కాటమయ్య రక్షణ కవచాలు**

గీత కార్మికుల సంక్షేమానికి ఉద్దేశించిన కాటమయ్య రక్షణ కవచాలు పథకం కింద ఇప్పటివరకు 50 వేల మందికి కిట్స్ మంజూరు కాగా ఇప్పటికే 40 వేల కిట్లను అందించినట్లు భట్టి విక్రమార్క వివరించారు. ప్రస్తుతం శిక్షణ పొందుతున్న మరో పదివేల మందికి కూడా శిక్షణ పూర్తయ్యాక ఈ కిట్లు పంపిణీ చేయాలని నిర్ణయించారు. ఈ పథకం కోసం మొత్తం రూ.60 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు డిప్యూటీ సీఎం తెలిపారు. సమావేశంలో బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బా□ మాయాదేవి, ఎంజేపీ సెక్రటరీ సైదులు, బీసీ సంక్షేమ శాఖ అధికారులు మల్లయ్య బట్టు, అలోక్ కుమార్, పద్మ, ఇందిరా, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నిధులు కోట్లల్లో.. పనులు లక్షల్లో!

- మెదక్, ఆదిలాబాద్ జిల్లాల్లో కొన్నిచోట్ల ఇప్పటికీ ప్రారంభం కాని పనులు
- ఇంటర్ బోర్డు ఉన్నతాధికారులు స్పందించాలని డిమాండ్



మొదటిపేజీ తరువాయి

**రిటైర్మెంట్ వేళ మాకెందుకు తలనొప్పి?**

మరోవైపు నిధుల వినియోగంలో జాప్యానికి కొందరు ప్రిన్సిపాళ్ల వైఖరి కూడా కారణంగా మారుతోంది. సర్వీసు చివరి దశలో ఉండి, ఏడాది రెండేళ్లలో రిటైర్మెంట్ కాబోయే ప్రిన్సిపాళ్లు ఈ పనుల వ్యవహారాల్లో తలదూర్చేందుకు వెనుకంజ వేస్తున్నారు. నాయకులు చేసే నాసిరకం పనుల వల్ల రేపటి రోజున క్వాలిటీ కంట్రోల్ తనిఖీల్లో తేడాలు వస్తే, రిటైర్మెంట్ బెనిఫిట్లు ఆగిపోతాయేమోనన్న భయంతో చాలామంది బిల్లుల చెల్లింపులకు, పనుల ఆమోదానికి ఆసక్తి చూపడం లేదు. చేస్తే కష్టాలు.. చేయకపోతే ఏ సమస్యా ఉండదు అన్నట్లుగా వ్యవహరిస్తుండటంతో నిధులు బ్యాంకు ఖాతాల్లోనే నిరుపయోగంగా మూలుగుతున్నాయి.

**వెల్దుర్తి సహా పలుచోట్ల శూన్యం..**

ముఖ్యంగా మెదక్, ఆదిలాబాద్ వంటి జిల్లాల్లోని పలు కళాశాలల్లో ఇప్పటివరకు కనీస పనులు కూడా మొదలుకాలేదు. ఉదాహరణకు మెదక్ జిల్లాలోని వెల్దుర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పనులు ప్రారంభించకపోవడంతో కళాశాల ప్రాంగణం వెలవెలబోతోంది. మరికొన్ని చోట్ల చేపట్టిన అరకొర పనుల వల్ల రాబోయే వర్షాకాలం నాటికి మళ్లీ మొదటికే వచ్చే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. లక్షలాది మంది పేద విద్యార్థుల విద్య, ఆరోగ్యంతో ముడిపడి ఉన్న ఈ సమస్యపై ఇంటర్ బోర్డు కమిషనర్, జిల్లా అధికారులు వెంటనే దృష్టిసారించాలి. ప్రతి కళాశాలలో జరిగిన పనులపై ప్రత్యేక విజిలెన్స్ బృందాలతో తనిఖీలు జరిపించి, నిధులను సద్వినియోగం చేస్తూ నాణ్యమైన పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని విద్యార్థి సంఘాలు, ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# సర్వర్ డౌన్

- 'సారథి', 'వాహన్' పోర్టల్లతో నెట్‌వర్క్‌పై పెరిగిన లోడ్

**తెలంగాణ బ్యూరో, సిరి న్యూస్**

తెలంగాణ రవాణాశాఖలో సాంకేతిక సమస్యలు నిత్యకృత్యంగా మారి సర్వర్ చిక్కులు.. సర్వం బాధలు అన్న చందంగా తయారయ్యాయి. అసలు ఏ సమయంలో సర్వర్ పనిచేస్తుందో, ఎప్పుడు మొరాయిస్తుందో తెలియక రాష్ట్రవ్యాప్తంగా వాహనదారులు, రవాణా రంగ నిపుణులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. గత వారం రోజులుగా తలెత్తిన సాంకేతిక సమస్యల కారణంగా రవాణాశాఖ పరిధిలో కార్యకలాపాలు దాదాపుగా స్తంభించిపోయాయి. వాహన రిజిస్ట్రేషన్లు, యాజమాన్య బదిలీలు, లెర్నింగ్ మరియు పర్మనెంట్ డ్రైవింగ్ లైసెన్సులు, పర్మిట్లు, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ల జారీ వంటి అత్యంత కీలకమైన పనులన్నీ అర్థాంతరంగా నిలిచిపోయాయి. సర్వర్ విపరీతంగా నెమ్మదించడం, డేటా ప్రాసెసింగ్ మధ్యలోనే స్తంభించడం, మాటిమాటికీ సర్వర్ కనెక్షన్ తెగిపోతుండటంతో ఆర్టీఏ కార్యాలయాలకు వస్తున్న వేలాది మంది ప్రజలు పనులేవీ కాక తలలు పట్టుకుంటున్నారు.

**నిమిషం పనికి రోజంతా పడిగాపులు..**

ప్రజల సమయం, శ్రమను ఆదా చేసి, దళారుల బెడద లేకుండా వేగవంతంగా పారదర్శక సేవలు అందించేందుకే ప్రభుత్వం రవాణాశాఖ సేవలను ఆన్‌లైన్ చేసింది.

కానీ క్షేత్రస్థాయిలో సాంకేతిక లోపాలు ప్రజలను మళ్లీ కార్యాలయాల గడప తొక్కేలా చేస్తున్నాయి. దరఖాస్తు నమోదు నుంచి చలానా ఫీజు చెల్లింపు, డాక్యుమెంట్ల వెరిఫికేషన్, డిజిటల్ సిగ్నేచర్, స్లాట్ బుకింగ్ వరకు ప్రతి ఒక్క ప్రక్రియ ఆన్‌లైన్ నెట్‌వర్క్‌పైనే ఆధారపడి ఉంటుంది. కంప్యూటర్ స్క్రీన్లు మొరాయించడంతో ఐదు నిమిషాల్లో పూర్తయ్యే చిన్న పనికి కూడా ప్రజలు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆఫీసుల వద్ద పడిగాపులు కాయాల్సి వస్తోంది. రోజువారీ వేతనాలు వదులుకుని డ్రైవర్లు, వ్యాపారాలు పక్కనపెట్టి వాహన యజమానులు, పనులన్నీ మానుకుని ఉద్యోగులు రోజుల తరబడి కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. ఒకసారి వచ్చి సర్వర్ రాకపోవడంతో నిరాశగా వెనుదిరిగి, మరుసటి రోజు మళ్లీ లైన్లలో నిలబడాల్సి వస్తోందని లబోదిబోమంటున్నారు.

**ఉద్యోగులకు తప్పని తలనొప్పి..**

ఈ సర్వర్ల సమస్య కేవలం సామాన్య ప్రజలనే కాకుండా ఆర్టీఏ కార్యాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, అధికారులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. విధి నిర్వహణలో భాగంగా ఉదయం వచ్చి సీట్లలో కూర్చుంటున్నా కంప్యూటర్లు స్పందించకపోవడంతో సిబ్బంది నిస్సహాయంగా ఉండిపోవాల్సి వస్తోంది. సాంకేతిక లోపాలకు తమకు ఎలాంటి సంబంధం లేకపోయినా.. క్యూలైన్లలో గంటల తరబడి వేచి ఉన్న ప్రజల అసహనాన్ని, ఆగ్రహాన్ని, నిలదీతలను మాత్రం అక్కడున్న ఉద్యోగులే ఎదుర్కోవాల్సి వస్తోంది. సర్వర్ ఎప్పుడు రీస్టోర్ అవుతుందో తెలియక సిబ్బంది సైతం తీవ్ర అనిశ్చితిలో కొట్టుమిట్టాడుతున్నారు. సర్వర్ కొద్దిసేపు పనిచేసిన సమయంలోనే పెండింగ్‌లో ఉన్న వందలాది ఫైళ్లను పూర్తి చేయాలనే ఆందోళన వారిపై తీవ్ర మానసిక పనిభారాన్ని పెంచుతోంది.

**తరచూ వైఫల్యాలకు కారణమేంటి?**

ఇటీవల రవాణాశాఖ సేవలను జాతీయ స్థాయి పోర్టల్లైన 'సారథి', 'వాహన్'లకు అనుసంధానించడంతో ట్రాఫిక్ విపరీతంగా పెరిగి నెట్‌వర్క్‌పై తీవ్ర ఒత్తిడి పడుతోంది. అయితే సర్వర్ సమస్యలు పదేపదే పునరావృతం కావడానికి అసలు మూల కారణం ఏమిటనే దానిపై సాంకేతిక విభాగానికి ఇప్పటికీ స్పష్టత లేకపోవడం గమనార్హం. సమస్య క్షేత్రస్థాయి కార్యాలయాల్లోని ఇంటర్నెట్ నెట్‌వర్క్‌లో ఉందా? హైదరాబాద్‌లోని స్టేట్ డేటా సెంటర్ సర్వర్లలో ఉందా? కేంద్ర అప్లికేషన్లలోనా? లేక సర్వర్ బ్యాండ్‌విడ్త్ సామర్థ్యం సరిపోక సిస్టమ్స్ క్రాష్ అవుతున్నాయా? అన్నది అంతుచిక్కడం లేదు. తరచూ సమస్య తలెత్తుతున్నా సాంకేతిక నిపుణులు తాత్కాలిక మరమ్మతులతో సరిపెడుతున్నారే తప్ప, లోపాల నివారణకు శాశ్వత ప్రణాళికలు రూపొందించడం లేదన్న విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. కోట్లాది మంది వినియోగదారులు ఆధారపడిన అత్యంత కీలకమైన ప్రభుత్వ శాఖలో ప్రధాన సర్వర్ మొరాయించినప్పుడు సేవలను కొనసాగించే ప్రత్యామ్నాయ డిజాస్టర్ రికవరీ వ్యవస్థలు, బ్యాకప్ డేటా సెంటర్లు ఎందుకు సమర్థవంతంగా పనిచేయడం లేదన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం, రవాణాశాఖ ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి, దీన్ని కేవలం చిన్న సాంకేతిక లోపంగా కాకుండా పాలనాపరమైన అత్యవసర సమస్యగా గుర్తించాలి.

# సిరిసిల్లకు సీఎం వరాలు..

మొదటిపేజీ తరువాయి

చేపట్టిన కార్యక్రమాలు ఈ పర్యటనలో ప్రధానంగా నిలవనున్నాయి.

**నేతన్నలకు 'నేతన్న బజార్'..**

సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు ఊతమిచ్చేలా ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణను సిద్ధం చేసింది. సాంచాలపై తయారయ్యే పెట్టికోట్, పాలియెస్టర్ వస్త్రాలకు మార్కెటింగ్ సదుపాయం కల్పించేందుకు 'నేతన్న బజార్' ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. చేనేత, పవర్‌లూమ్ ఉత్పత్తులకు మెరుగైన మార్కెట్ కల్పించడం దీని ప్రధాన ఉద్దేశం. పెద్దూరులో నిర్మించిన ఇందిరా మహిళా శక్తి భవనాన్ని సీఎం ప్రారంభించనున్నారు. మహిళా స్వయం సహాయక సంఘాల సమావేశాలు, జీవనోపాధి శిక్షణలు, మహిళలు తయారు చేసే ఉత్పత్తుల విక్రయాలకు ఈ భవనం కేంద్రంగా ఉపయోగపడనుంది.

**రూ.200 కోట్లతో విద్యా సముదాయాలు**

జిల్లాలో విద్యా ప్రమాణాలను పెంచే దిశగా సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల్లో రూ.200 కోట్లతో 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లు' నిర్మించనున్నారు. పెద్దూరులో 18 ఎకరాల విస్తీర్ణంలో ప్రతిపాదించిన విద్యా సముదాయంలో 5 నుంచి 12వ తరగతి వరకు సుమారు 2,600 మంది విద్యార్థులకు విద్య, వసతి కల్పించనున్నారు. 64 తరగతి గదులు, డార్మిటరీలు, డైనింగ్ బ్లాక్, క్రీడా మైదానాలు ఏర్పాటు చేయనున్నారు. సిరిసిల్ల, కోనరావుపేటల్లో 'తెలంగాణ పబ్లిక్ స్కూల్స్' నిర్మాణాలకు కూడా సీఎం శంకుస్థాపన చేయనున్నారు.

**రాజన్న ఆలయానికి రూ.99.40 కోట్లు**

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ సమగ్ర అభివృద్ధిలో భాగంగా రూ.99.40 కోట్లతో చేపట్టనున్న 26 రకాల పనులకు సీఎం శ్రీకారం చుట్టనున్నారు. ప్రాకారాలు, గోపురాలు, మండపాలు, డ్రైనేజీ, విద్యుదీకరణ, షాపింగ్ కాంప్లెక్స్‌ల నిర్మాణం ఇందులో ఉన్నాయి. ఆలయ అభివృద్ధి పనులతో వేములవాడ పుణ్యక్షేత్రంలో మౌలిక వసతులు మరింత మెరుగుపడనున్నాయి.

**కొత్త కార్యాలయాలు.. పోలీస్ స్టేషన్లు**

పరిపాలనా సౌలభ్యం కోసం సిరిసిల్ల, వేములవాడల్లో రెండు కొత్త ఆర్డీఓ కార్యాలయాలు, తంగళ్లపల్లి, వీర్నపల్లి, వేములవాడ రూరల్, రుద్రంగిలో నాలుగు తహసీల్దార్ కార్యాలయాల నిర్మాణానికి శంకుస్థాపనలు చేయనున్నారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ భవనాల నిర్మాణ పనులకు కూడా శ్రీకారం చుట్టనున్నారు. రుద్రంగిలో 10 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో వ్యవసాయ ఉత్పత్తుల గోదాములు నిర్మించనున్నారు. వేములవాడలో మహిళా పోలీస్ స్టేషన్, వేములవాడ, సిరిసిల్ల పట్టణాల్లో రెండు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లను అందుబాటులోకి తీసుకురానున్నారు.

# ఉత్తర, దక్షిణ భారత రాజకీయ శైలి వేరు

**దిల్లీ, సెప్టెంబర్ 28:**

తెలంగాణలో విద్యార్థి సంఘాలు చాలా తక్కువ.. లెఫ్ట్, రైట్ సంఘాలున్నాయి. ఎన్ఎస్ఐయూ ప్రభావం పెద్దగా లేదు. ఉత్తర భారతదేశంలో, దక్షిణ భారత దేశంలో రాజకీయాల శైలి వేరని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. దిల్లీలో అస్సాం దినపత్రిక ప్రతిదిన్ సోమవారం నిర్వహించిన కాంక్లేవ్‌లో ఇండియాస్ నెక్స్ట్ చాప్టర్ అంశంపై ప్రసంగించారు. మా దగ్గర యూనివర్సిటీ లా కాలేజ్, ఆర్ట్స్ కాలేజీ నాయకునిగా ఏబీవీపీలో గెలిచిన వారు తర్వాత కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేస్తారు. యూనివర్సిటీలో విద్యార్థి సంఘంలో ఉన్నా, గ్రామానికి వెళ్లిన తర్వాత ఆ కుటుంబం కాంగ్రెస్‌లోనే ఉంటుంది. తెలంగాణలో బీజేపీకి పెద్దగా ప్రాధాన్యం లేదు. స్టూడెంట్ రాజకీయాల్లో ఏబీవీపీ ప్రభావం ఉంటే రాజకీయాల్లో కాంగ్రెస్ ప్రభావం ఉంటుందన్నారు. నేను 2006లో జడ్పీటీసీ సభ్యునిగా, 2007లో ఎమ్మెల్సీగా ఇండిపెండెంట్‌గా గెలిచా. ఆ రెండు సార్లు నేను కాంగ్రెస్ అభ్యర్థులను ఓడించా.. అక్కడ రెండు పార్టీలే ఉన్నాయి.. కాంగ్రెస్, తెలుగుదేశం. నాకు జిల్లాలో కాంగ్రెస్ నాయకులతో పెద్దగా సంబంధాలు పెద్దగా లేవు.. ప్రభుత్వంపై పోరాడాలంటే ప్రతిపక్షమే మేలని భావించా. అందుకే నేను తెలుగుదేశంలో చేరా. ఆ పార్టీ నుంచి 2009, 2014లో ఎమ్మెల్యేగా గెలిచా. తెలంగాణ అభివృద్ధి, సంక్షేమం, తెలంగాణ ప్రజలకు మేలు చేయడం కోసం, ప్రజల ఆత్మగౌరవం కోసం సోనియా గాంధీ తెలంగాణ ఇచ్చారు. రాష్ట్ర విభజన తర్వాత నాయకత్వం ఆంధ్రప్రదేశ్‌లో ఉండడంతో తెలుగుదేశం పార్టీకి తెలంగాణలో ప్రాధాన్యం తగ్గిపోయింది. మీరు మంచి నాయకుడు, మీరు నాయుడుతో కలిసి పని చేస్తే తెలంగాణలో ఇబ్బంది అని ప్రజలు చెప్పారు. దాంతో నేను కాంగ్రెస్‌లో చేరాలని నిర్ణయించుకున్నాను. రాహుల్ గాంధీ, దిగ్విజయ్ సింగ్, జైరాం రమేశ్ తోపాటు నా శ్రేయోభిలాషులు కాంగ్రెస్‌లో ఉన్నారు. తెలుగుదేశం కేంద్రంలో ఎన్డీఏతో ఉంది. ఏపీలో ఎన్డీఏ ఉంది. తెలంగాణలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఉంది. నేను రెండింటితో పోరాడాల్సి ఉంది. ఆమె ఏ లక్ష్యాలతో తెలంగాణ ఇచ్చారో వాటన్నింటిని కేసీఆర్ ప్రభుత్వం తుంగలో తొక్కింది. అందుకే నేను 2017లో కాంగ్రెస్‌లో చేరాను. రాహుల్ గాంధీని కలిసిన తర్వాత 15 నిమిషాలు మాట్లాడాం. ఆ రోజే ఆయన నా నాయకుడు అని నిర్ణయించుకున్నా.



2019లో ఎంపీగా గెలిచాను. రాష్ట్రంలో 2014 ఎన్నికల తర్వాత కేసీఆర్, రేవంత్ మధ్య పోటీగా మారింది. ఆయన నన్ను అనేకసార్లు జైలుకు పంపారు. నేను అసెంబ్లీకి కన్నా జైలుకే ఎక్కువసార్లు వెళ్లానని గుర్తుచేసారు. 2023లో కేసీఆర్ ను ఓడించాను. రాహుల్ గాంధీకి ఎటువంటి వ్యక్తిగత అజెండాలు లేవు. ఆయనకు దేశమే ముఖ్యం. నేను విద్యార్థి సంఘంలో ఉన్నా. నాయుడు పార్టీలో ఉన్నా దేశం, రాష్ట్రం కోసం ఏదైనా చేయాలనుకున్నానని స్పష్టం చేశారు.

**ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్యే నా లక్ష్యం**

తెలంగాణలోని ప్రభుత్వ విద్యావ్యవస్థను సమూలంగా ప్రక్షాళన చేసి యువతకు అంతర్జాతీయ స్థాయి నైపుణ్యాలు అందిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. స్వాతంత్ర్యం వచ్చినప్పుడు 12.50% కంటే తక్కువగా ఉన్న అక్షరాస్యతను 33 ఏళ్లుగా ఉన్న సగటు ఆయుర్దాయాన్ని పెంచేందుకు పండిట్ నెహ్రూ విద్య, సాగునీరు, ఆరోగ్య రంగాలకు బలమైన పునాదులు వేశారని గుర్తుచేశారు. దేశంలో సగటున 30 మంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడు ఉంటే, తెలంగాణ ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతి 17 మందికి ఒక టీచర్ ఉన్నారని పేర్కొన్నారు. మెరుగైన టీచర్‌స్టూడెంట్ రేషియో ఉన్నప్పటికీ సరైన నాణ్యత, ఇంగ్లీష్ మీడియం బోధన, నర్సరీ/ప్రీప్రైమరీ తరగతులు లేకపోవడం వల్ల ఏటా 50 నుంచి 60 వేల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలను వీడుతున్నారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో లోపాలను సవరించి తగిన మార్పులు సూచించేందుకు ప్రత్యేక విద్యా కమిషన్‌ను నియమించామన్నారు. ప్రభుత్వం ఏటా రూ. 2,500 కోట్లు ఫీజు రీయింబర్స్‌మెంట్‌గా చెల్లిస్తున్నప్పటికీ కొన్ని ప్రైవేటు కళాశాలల్లో తగిన సంఖ్యలో లెక్చరర్లు, విద్యార్హతల నాణ్యత కొరవడుతోందని, వీటిని క్రమబద్ధీకరిస్తామని సీఎం స్పష్టం చేశారు.

# ఓటు చోరీకి తెరపడితే బీజేపీ పాలనకూ తెరపడ్డట్టే

- ప్రజాస్వామ్య పరిరక్షణ పోరాటాన్ని నడిపిస్తున్న రాహుల్
- తదుపరి ప్రధాని రాహుల్ గాంధీయే
- తెలంగాణలో రెండోసారీ కాంగ్రెస్ ప్రభుత్వమే
- సాగునీటిపై బీఆర్ఎస్‌ది అసత్య ప్రచారమే
- నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్

**మిర్యాలగూడ/హైదరాబాద్, సెప్టెంబర్ 28 :**

దేశంలో ఓటు చోరీకి తెరపడిన రోజే కేంద్రంలో బీజేపీ పాలన అంతానికి నాంది పలికినట్టేనని నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. భారత ఎన్నికల ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేపట్టిన పోరాటం ఇప్పుడు నిర్ణాయక దశకు చేరుకుందన్నారు. భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్‌కు వ్యతిరేకంగాగా టీపీసీసీ పిలుపుమేరకు మిర్యాలగూడలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో సోమవారం జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ దేశ ఎన్నికల వ్యవస్థకు పెనుముప్పుగా మారిన ఓటు చోరీపై రాహుల్ గాంధీ ధైర్యంగా, దృఢ సంకల్పంతో పోరాడుతున్నారని చెప్పారు. అధికారాన్ని శాశ్వతం చేసుకోవాలనే ఉద్దేశంతో బీజేపీ ప్రజాస్వామ్య సంస్థలను బలహీనపరుస్తోందని ఆరోపించారు. ప్రజాస్వామ్యంపై విశ్వాసమున్న ప్రతి పౌరుడు, ప్రతి కాంగ్రెస్ కార్యకర్త రాహుల్ గాంధీ నాయకత్వంలో సాగుతున్న ఈ పోరాటంలో భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. ఎన్ని ఎన్నికల ఎదురుదెబ్బలు తగిలినా, ఎన్ని రాజకీయ సవాళ్లు ఎదురైనా మారుమూల గ్రామాల వరకు కార్యకర్తలు పార్టీపై అచంచల విశ్వాసంతో నిలిచారని ఉత్తమ్ కొనియాడారు. వారి చెమట, కష్టం, త్యాగాల పునాదులపైనే తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిందన్నారు. తెలంగాణలో ముఖ్యంగా ఉమ్మడి నల్గొండ జిల్లాలో కాంగ్రెస్‌కు ప్రజలు ఎప్పుడూ బలమైన విజయాలను అందించారని గుర్తు చేశారు. రాహుల్ గాంధీ నాయకత్వంపై దేశ ప్రజలకు సంపూర్ణ విశ్వాసం ఉందని, ఆయన తదుపరి ప్రధానమంత్రి కావాలని దేశం కోరుకుంటోందని చెప్పారు. 'రాహుల్ గాంధీ భారత తదుపరి ప్రధానమంత్రి అవుతారు.. తెలంగాణలోనూ కాంగ్రెస్ వరుసగా రెండోసారి అధికారంలోకి రావడం ఖాయం' అని ఉత్తమ్ ధీమా వ్యక్తం చేశారు. నాగార్జునసాగర్ ఆయకట్టు పరిధిలోని నియోజకవర్గాల నుంచే తాను ఆరుసార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి లోక్‌సభ సభ్యుడిగా ఎన్నికయ్యానని గుర్తు చేశారు.

**బీఆర్ఎస్‌ది దుష్ప్రచారం**

సాగునీటి విషయంలో తనపై బీఆర్ఎస్ చేస్తున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని, రాజకీయ దురుద్దేశంతోనే తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మంత్రి ఉత్తమ్ మండిపడ్డారు. ఎల్‌నినో ప్రభావంతో తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్రల్లోనూ నైరుతి రుతుపవనాలు బలహీనపడి వర్షపాతం, జల లభ్యత తగ్గినట్లు వివరించారు. క్లిష్ట పరిస్థితులు ఉన్నప్పటికీ నాగార్జునసాగర్ జలాలను రాష్ట్ర ప్రభుత్వం అత్యంత జాగ్రత్తగా వినియోగిస్తోందన్నారు. సాగునీటి అవసరాలను దృష్టిలో పెట్టుకోవడంతోపాటు వేసవిలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు రాకుండా అవసరమైన నిల్వలను కాపాడుతున్నామని చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పంపిణీ చేసిన ముతక బియ్యాన్ని లబ్దిదారులు వాడుకోనందున అవి అక్రమ మార్కెట్‌కు తరలిపోయేవని ఉత్తమ్ తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పరిస్థితిని మార్చి 3.42 కోట్ల మంది లబ్దిదారులకు ప్రతీ వ్యక్తికి నెలకు ఆరు కిలోల చొప్పున ఉచితంగా సన్న బియ్యం అందిస్తూ ప్రజాపంపిణీ వ్యవస్థలో విప్లవాత్మక మార్పు తీసుకొచ్చినట్లు చెప్పారు. నాగార్జునసాగర్‌మిర్యాలగూడ ప్రాంతంలో కొనసాగుతున్న ఆరు ఎత్తిపోతల పథకాలను ప్రస్తుత ప్రభుత్వ హయాంలోనే పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. పనులను వేగవంతం చేసేందుకు అదనపు నిధులు కేటాయించినట్లు తెలిపారు. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న ఎస్ఎల్‌బీసీ సొరంగాన్ని 2028 జూన్ నాటికి పూర్తి చేసి ఉమ్మడి నల్గొండ జిల్లాలోని లక్షలాది ఎకరాలకు సాగునీరు అందిస్తామని ఉత్తమ్ కుమార్ పునరుద్ఘాటించారు.

# హైదరాబాద్‌లో 'బిల్ట్రస్ట్' జీసీసీ ఏర్పాటు

**మొదటిపేజీ తరువాయి**

ఎంచుకుంటుండగా తాజాగా ఈ జాబితాలో ప్రముఖ బిజినెస్ టూ బిజినెస్ (బీ2బీ) క్యాష్ జనరేషన్ ప్లాట్‌ఫాం 'బిల్ట్రస్ట్' కూడా చేరింది. మాదాపూర్ రహేజా మైండ్ స్పేస్‌లో 40వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో రూ.450 కోట్ల పెట్టుబడి అంచనా వ్యయంతో అభివృద్ధి చేసిన 'బిల్ట్రస్ట్ టెక్నాలజీ సెంటర'ను ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సోమవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆనతికాలంలోనే హైదరాబాద్ జీసీసీలకు హబ్‌గా మారిందన్నారు. గతేడాది 75కు పైగా కొత్త జేసీసీలు ఇక్కడ ప్రారంభమయ్యాయని, ఇది దేశంలోనే అత్యధికమని వివరించారు. ఈ ఏడాది 100 జీసీసీలను ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. జీసీసీలను 'బ్యాక్ ఆఫీస్ ఆపరేషన్లకు మాత్రమే పరిమితం చేయకుండా గ్లోబల్ వాల్యూ సెంటర్లుగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామన్నారు. హైదరాబాద్‌లో ఏఐఫస్ట్ జీసీసీని ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చిన 'బిల్ట్రస్ట్'కు ప్రభుత్వం తరఫున అన్ని రకాలుగా అండగా ఉంటామన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఈ సంస్థ 2,600 మంది బీ2బీ సరఫరాదారులు, 14 మిలియన్లకు పైగా కొనుగోలుదారులకు సేవలు అందిస్తోందన్నారు. గ్లోబల్ ఆపరేషన్స్, టెక్నాలజీ, ఆరఅండ్ డీ విభాగాల అనుసంధానంలో ఈ టెక్నాలజీ సెంటర్ కీలకపాత్ర పోషిస్తుందన్నారు. ఇక్కడ దశలవారీగా కొత్తగా వేయిమంది హై స్కిల్డ్ వర్క్ ఫోర్స్‌కు ఉద్యోగాలు లభిస్తాయన్నారు. హైదరాబాద్‌లో టెక్ ట్యాలెంట్‌కు కొదవ లేదని, వారిని పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్రంలోని ప్రముఖ విద్యా సంస్థలు, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, టాస్క్, టీ హబ్ తదితర సంస్థలతో కలిసి పనిచేసేందుకు ముందుకు రావాలని బిల్ట్రస్ట్ ప్రతినిధులను మంత్రి శ్రీధర్‌బాబు ఆహ్వానించారు. కార్యక్రమంలో బిల్ట్రస్ట్ సీఈవో గ్రాంట్ హల్లరాన్, ఇండియా జీసీసీ కంట్రీ హెడ్ ఫర్హాద్ హెచ్.బారియా తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగ పరీక్షల షెడ్యూల్ విడుదల

- సీబీటీ విధానంలో నిర్వహించనున్న టీజీపీఎస్సీ

**హైదరాబాద్, సెప్టెంబర్ 28:**

రాష్ట్రంలోని వివిధ శాఖల్లో ఉద్యోగాల భర్తీకి నిర్వహించే పరీక్షల షెడ్యూల్‌ను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) విడుదల చేసింది. అక్టోబర్, నవంబర్ నెలల్లో ఆయా పోస్టులకు కంప్యూటర్ ఆధారిత పరీక్షలు (సీబీటీ) నిర్వహించనున్నట్లు ప్రకటించింది.

తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలిలో అసిస్టెంట్ సైంటిస్ట్ (అనలిస్ట్ గ్రేడ్II) పోస్టులకు అక్టోబర్ 24న పరీక్ష నిర్వహించనున్నారు. అదే మండలిలో అసిస్టెంట్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ పోస్టులకు అక్టోబర్ 26న పరీక్ష జరగనుంది.

నవంబర్‌లో ఏఈఈ, డీఈవో పరీక్షలు రోడ్లు, భవనాల శాఖలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (సివిల్) పోస్టులకు నవంబర్ 6, 7 తేదీల్లో పరీక్షలు నిర్వహించనున్నారు. పాఠశాల విద్యాశాఖ పరిధిలోని డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్, గెజిటెడ్ హెడ్‌మాస్టర్ గ్రేడ్I పోస్టులకు నవంబర్ 12, 13 తేదీలను ఖరారు చేశారు.

ఈ పరీక్షలన్నీ సీబీటీ విధానంలోనే జరుగుతాయని టీజీపీఎస్సీ ప్రెస్‌నోట్‌లో స్పష్టం చేసింది. అభ్యర్థులు షెడ్యూల్‌ను గమనించి పరీక్షలకు సిద్ధం కావాలని సూచించింది.

# వైఐఐఆర్ఎస్ నిర్మాణాలను పరుగులు పెట్టించండి

- కచ్చితమైన క్యాలెండర్‌తో పనులు పూర్తి చేయాలి
- గడువులోగా భవనాలు అందించాలి
- సీసీ కెమెరాలతో నిరంతర పర్యవేక్షణ
- ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించిన డిప్యూటీ సీఎం భట్టి

**హైదరాబాద్, సిరి న్యూస్,, సెప్టెంబర్ 28 :**



రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ (వైఐఐఆర్ఎస్) భవనాల నిర్మాణ పనులను వేగవంతం చేసి ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ప్రజాభవన్ లో వైఐఐఆర్ఎస్ భవన నిర్మాణ పురోగతిపై ఇంజనీరింగ్ విభాగం ఉన్నత స్థాయి అధికారులతో ఆయన సోమవారం సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తున్న ఈ పథకాన్ని త్వరితగతిన పూర్తి చేయడానికి ఇంజనీరింగ్ అధికారులు రాత్రింబవళ్లు శ్రమించి పనుల్లో పురోగతి చూపాలన్నారు. రాష్ట్రంలోని పేద విద్యార్థులకు కులమతాలకు అతీతంగా ఒకే ప్రాంగణంలో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో నాణ్యమైన విద్యను, సకల సౌకర్యాలను అందించడమే ఈ ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశమని ఆయన స్పష్టం చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసి మైనారిటీ వర్గాల పిల్లలందరినీ ఒకేచోట చేర్చి సమీకృత పద్ధతిలో అత్యుత్తమ విద్యాబోధన అందించడం ద్వారా విద్యార్థుల్లో సామాజిక సమానత్వం పెంపొందుతుందని డిప్యూటీ సీఎం తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో ఈ పాఠశాల భవనాల నిర్మాణానికి సంబంధించి జిల్లా కలెక్టర్లతో కలిసి ఇంజనీరింగ్ అధికారులు వెంటనే ప్రత్యేక 'వర్క్ క్యాలెండర్'ను రూపొందించాలని ఆదేశించారు. వారానికోసారి పనుల పురోగతిని సమీక్షించి తనకు క్రమం తప్పకుండా నివేదికలు పంపాలని స్పష్టం చేశారు. నిర్మాణ పనులను క్షేత్రస్థాయి నుంచి నిరంతరం పర్యవేక్షించేందుకు వీలుగా నిర్మాణ ప్రాంతాల్లో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. వచ్చే నెల రెండో వారం నుంచి నిర్మాణంలో ఉన్న స్కూళ్లను తానే స్వయంగా ఆకస్మిక తనిఖీలు చేస్తానని డిప్యూటీ సీఎం వెల్లడించారు. ఈ సమావేశంలో ఈఎంసీ గణపతి రెడ్డి రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలల నిర్మాణ పురోగతి వివరాలను డిప్యూటీ సీఎంకు నివేదించారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు 87 నియోజకవర్గాల్లో ఈ పాఠశాలలు మంజూరయ్యాయని, అందులో 70 పాఠశాలల నిర్మాణ పనులు వేగంగా ప్రారంభమయ్యాయని తెలిపారు. మరొక ఐదు పాఠశాలలకు సంబంధించి డీపీఆర్ తయారు చేస్తున్నామని, మూడింటి టెండర్లు ముగింపు దశకు వచ్చాయని, మిగిలిన నాలుగు పాఠశాలలకు సంబంధించి స్థల సమస్యలు ఉన్నాయని వివరించారు. ప్రభుత్వం నిర్దేశించిన కాలపరిమితికి అనుగుణంగా పనులన్నీ పూర్తి చేసి భవనా లను త్వరలోనే అందుబాటులోకి తీసుకొస్తామని అధికారులు డిప్యూటీ సీఎంకు హామీ ఇచ్చారు.

# ఇన్ఫ్లుయెన్సర్లది కీలక పాత్ర

- ఎఫ్‌డీసీ చైర్మన్ దిల్ రాజు

**హైదరాబాద్, సిరి న్యూస్, సెప్టెంబర్ 28 :**



తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, బతుకమ్మ పండుగ విశిష్టతతోపాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ప్రజా పాలన సమాచారాన్ని సృజనాత్మక డిజిటల్ కంటెంట్ ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఇన్ఫ్లుయెన్సర్లు కీలక పాత్ర పోషిస్తారని తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఎఫ్‌డీసీ) చైర్మన్ దిల్ రాజు పేర్కొన్నారు. బతుకమ్మ యంగ్ ఫిలిం మేకర్స్ ఛాలెంజ్ 2026లో భాగంగా ఇన్ఫ్లుయెన్సర్ల సమావేశం ఎఫ్‌డీసీ కార్యాలయంలో సోమవారం జరిగింది. దిల్ రాజు, ఎఫ్‌డీసీ మేనేజింగ్ డైరెక్టర్ ఎం.ముకుంద రెడ్డి, ప్రభుత్వ క్రియేటివ్ డైరెక్టర్ కొండా రాజు ఆధ్వర్యంలో ఇన్ఫ్లుయెన్సర్ జీలా అనిల్ సమన్వయంతో ఈ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బతుకమ్మ యంగ్ ఫిలిం మేకర్స్ ఛాలెంజ్ లక్ష్యాలు, పోటీ విధివిధానాలు, వివిధ విభాగాలు, పాల్గొనే విధానం తదితర అంశాలను ఇన్ఫ్లుయెన్సర్లకు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం యువ కళాకారులు, కంటెంట్ క్రియేటర్లు, ఫిల్మ్ మేకర్లను ప్రోత్సహించే ఉద్దేశంతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో ఇన్ఫ్లుయెన్సర్లు విస్తృతంగా భాగస్వాములు కావాలని సూచించారు. ఇన్ఫ్లుయెన్సర్ల విభాగంలో ప్రభుత్వ పథకాలు, ప్రజా పాలనపై రీల్స్, డిజిటల్ స్టోరీ టెలింగ్ ద్వారా కంటెంట్ రూపొందించేందుకు అవకాశం కల్పించారు. యువ ఫిల్మ్ మేకర్లు, ఇన్ఫ్లుయెన్సర్లు, కంటెంట్ క్రియేటర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు. కార్యక్రమంలో ఎఫ్‌డీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కిషోర్‌బాబు, బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ మామిడి హరికృష్ణ, సినీ నటుడు రచ్చ రవి, అనిల్, అభినవ్ తదితరులు పాల్గొన్నారు.

# నిరసనలకు అడ్డాగా సచివాలయం

**మొదటిపేజీ తరువాయి**

తప్పించుకు తిరుగుతారని ప్రశ్నించారు. బడా కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లిస్తూ చిన్న కాంట్రాక్టర్లు, రిటైర్డ్ ఉద్యోగుల బిల్లులు నెలలతరబడి పెండింగ్‌లో పెట్టడం దారుణమని అన్నారు. పెండింగ్ బిల్లుల మంజూరు కోసం 2030% కమీషన్ డిమాండ్ చేస్తున్నారంటూ గతంలో సచివాలయంలో ఆర్థిక మంత్రి ఛాంబర్ ముందు ఆందోళనకు దిగారు అంటే కమీషన్లు ఇవ్వలేదనే కారణంతోనే వారి బిల్లులు ఆపుతున్నారా అని ఆయన ప్రశ్నించారు. రిటైర్డ్ ఉద్యోగులకు బకాయిలు విడుదల చేస్తామని మే నెలలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఇచ్చిన హామీ నీటి మూటలేనా అన్నారు. మాటలు కోటలు దాటితే చేతలు గడప దాటవు అనడానికి ఇంతకంటే నిదర్శనమేం కావాలని వ్యాఖ్యానించారు. రిటైర్డ్ ఉద్యోగులు, కాంట్రాక్టర్ల ఆవేదన వినే సమయం కూడా ఈ ప్రభుత్వానికి లేదా అని నిలదీశారు. 30 ఏళ్లకు పైగా సేవలందించిన ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు మీ ప్రభుత్వం ఇచ్చే గౌరవం ఇదేనా అని అడిగారు. వారి గోడు ఈ ప్రభుత్వానికి పట్టదా అన్నారు. 2024 మార్చి నుంచి రిటైర్ అయిన ఉద్యోగులు, ఉపాధ్యాయులకు బెన్ఫిట్స్ అందక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటుంటే ప్రభుత్వం ఏం చేస్తున్నట్లు అని ప్రశ్నించారు. సర్వీసులో ఉన్ననాడు దాచుకున్న సొమ్మును కూడా తిరిగి ఇవ్వకుండా ప్రభుత్వం వేధిస్తుండటం అమానవీయం.. అనైతికం అని అన్నారు. సమస్యలు వినడానికే సిద్ధంగా లేని ప్రభుత్వం పరిష్కారం ఎలా చూపుతుందని అడిగారు. ప్రజల సమస్యలు వినాల్సి ఉండగా తమ సమస్యలు చెప్పుకోవడానికి వచ్చిన ప్రజలను పోలీసులతో అడ్డుకునే పరిస్థితి దారుణమన్నారు. ఇదేనా కాంగ్రెస్ చెప్పిన ప్రజా పాలన అని అడిగారు. ఎన్నికల ముందు ఆరు గ్యారెంటీలు, 420 హామీలు ఇచ్చి ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చాక ప్రజలకే అపాయింట్‌మెంట్ ఇవ్వకపోవడం ఇది ప్రజా పాలనా లేక కాంగ్రెస్ మార్క్ వంచనా అని హరీశ్‌రావు ప్రశ్నించారు.

# స్వచ్ఛ ఆటో వ్యవస్థను ప్రైవేట్ పరం చేయొద్దు

- మానవ హక్కుల వేదిక డిమాండ్

**హైదరాబాద్, సిరి న్యూస్, సెప్టెంబర్ 28 :**

హైదరాబాద్ నగరంలో ప్రజల ఇళ్ల నుంచి, దుకాణాలు, హోటళ్లు, ఇతర వాణిజ్య, సంస్థల నుంచి ప్రతిరోజూ చెత్తను సేకరించి, జీహెచ్ఎంసీ నిర్దేశించిన ప్రాంతాలకు తరలించే స్వచ్ఛ ఆటోలు, టిప్పర్లు, ట్రాలీల కార్మిక వ్యవస్థను ప్రైవేటు సంస్థకు అప్పగించే చర్యలను ప్రభుత్వం నిలిపివేయాలని మానవ హక్కుల వేదిక ఒక ప్రకటనలో డిమాండ్ చేసింది. రెండు దశాబ్దాలుగా హైదరాబాద్‌లో చెత్త సేకరణ, తరలింపు కోసం ఈ విధానం అమలులో ఉంది. గత ప్రభుత్వం సబ్సిడీపై దళిత, వెనుకబడిన వర్గాలకు చెందిన కార్మికులకు సుమారు 4,750 స్వచ్ఛ చెత్త తరలింపు వాహనాలను అందించింది. ఈరంగం లో ఉపాధికి అవకాశం ఉందని, నిరుద్యోగులు గత 20 సంవత్సరాల్లో సుమారు 15వేల మంది కార్మికులు స్వంతంగా ఆటోలు, ట్రాలీలు తదితర వాహనాలను సమకూర్చుకుని చెత్త సేకరణ, తరలింపు ద్వారా స్వయం ఉపాధి పొందుతున్నారు. ఈ కార్మికులు ప్రజల ఇళ్ల నుంచి, దుకాణాలు, హోటళ్లు, ఇతర సంస్థల నుంచి చెత్తను సేకరించి, అందుకోసం కొంత తీసుకుంటూ తమ జీవనోపాధిని కొనసాగిస్తున్నారు. ఈ విధంగా వారు తమ స్వంత శ్రమ,ఆర్థిక వనరులు సమకూర్చుకొని, దాదాపు 10 వేల వాహనాలను ఖరీదు చేసి, ఒక వికేంద్రీకృత చెత్త సేకరణ, తరలింపు వ్యవస్థను ఏర్పరచుకున్నారు. ప్రస్తుతం సేకరించిన చెత్తను జీహెచ్ఎంసీ నిర్దేశించిన ప్రాంతాలకు తరలించిన అనంతరం, అక్కడి నుంచి రాంకీ ఎన్విరో ఇంజనీర్స్ సంస్థకు చెందిన వాహనాల ద్వారా జవహర్‌నగర్‌లోని ప్రధాన డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. అయితే, కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే ఉన్న ఈ స్వచ్ఛ ఆటో, టిప్పర్ కార్మిక స్వయం ఉపాధి వ్యవస్థను, అందులో ఆధారపడి జీవిస్తున్న వేలాది మంది కార్మికులతో సహా, ఒక ప్రైవేటు సంస్థకు అప్పగించే ప్రయత్నం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ చర్య అమలైతే తమ సొంత శ్రమతో ఏర్పరచుకున్న స్వయం ఉపాధి అవకాశాలను కోల్పోయే ప్రమాదం కార్మికులకు ఏర్పడుతుంది. అంతేకాక వారి జీవనోపాధి, సామాజిక భద్రతపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంది. తమను మున్సిపల్ శాఖ ఆధీనంలోనే కొనసాగించాలని, తమ ఉపాధికి భద్రత కల్పించడంతో పాటు పెన్షన్, ఆరోగ్య భద్రత, బీమా తదితర సామాజిక భద్రతా సౌకర్యాలతో కూడిన వ్యవస్థను ఏర్పాటు చేయాలని స్వచ్ఛ ఆటో, టిప్పర్ కార్మికులు కొంతకాలంగా ఆందోళన చేస్తున్నారు. ప్రజారోగ్యం, పారిశుద్ధ్యం వంటి కీలకమైన ప్రజా సేవలను నిర్వహిస్తున్న కార్మికుల జీవనోపాధిని ప్రైవేటీకరణ పేరుతో దెబ్బతీయడం చాలా అన్యాయం. ఇప్పటికే తమ స్వంత శ్రమ,స్వంత పెట్టుబడితో ఏర్పరచుకున్న ఈ కార్మికుల స్వయం ఉపాధి వ్యవస్థను మరింత బలోపేతం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. స్వచ్ఛ ఆటో, టిప్పర్, ట్రాలీ కార్మిక వ్యవస్థను రాంకీ వంటి ప్రైవేటు సంస్థకు అప్పగించవద్దని, ఈ కార్మికులు నిర్మించుకున్న వ్యవస్థ ను, మరింత పటిష్టం చేయాలని, వారికి ఆరోగ్య బీమా, ప్రమాద బీమా, పెన్షన్ తదితర సామాజిక భద్రతా సౌకర్యాలతో కూడిన సమగ్ర సంక్షేమ వ్యవస్థను ఏర్పాటు చేయాలని, చెత్త సేకరణ, తరలింపు రంగంలో పనిచేస్తున్న వేలాది మంది కార్మికుల జీవనోపాధికి ప్రభుత్వం పూర్తి రక్షణ కల్పించాలని మానవ హక్కుల వేదిక ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది.




# భూసమస్య పరిష్కారానికి రీసర్వే ఏకైక మార్గం

**మొదటిపేజీ తరువాయి**

పరిష్కారం చూపిస్తామని తెలిపారు. గత ప్రభుత్వం మాదిరిగా నాలుగు గోడల మధ్య ఆలోచన చేయకుండా ప్రజల కోణంలో ఆలోచన చేసి సమస్యను పరిష్కరిస్తున్నామని అన్నారు. భూ భారతి చట్టంలో ఇచ్చిన హామీ మేరకు ప్రతి భూ పార్శిల్‌కు ప్రత్యేక గుర్తింపు, జియో కోఆర్డినేట్స్‌తో కూడిన మ్యాప్, ఎల్‌పీఎం నంబర్ అందించే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని మంత్రి వివరించారు. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లావ్యాప్తంగా రెవెన్యూ, రిజిస్ట్రేషన్, హౌసింగ్ అంశాలపై వనపర్తిలో సోమవారం సమీక్ష అనంతరం మంత్రి పొంగులేటి సహచర మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరితో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో ధరణి చట్టం వలన ప్రజలకు కలిగిన అసౌర్యాలు, అవస్థలను రూపుమాపుతూ భూభారతి పోర్టల్ లో పేర్కొన్నవిధంగా భూధార్ కార్డులను అందించడమే ధ్యేయంగా ఈ ప్రజా ప్రభుత్వం సర్వే కార్యక్రమం నిర్వహిస్తోందన్నారు. భూభారతి కింద 70 రెవెన్యూ గ్రామాలను తొలి దశలో సర్వేకు ఎంపిక చేయగా, రాష్ట్రంలో నక్షాలు అందుబాటులో లేని సుమారు 413 రెవెన్యూ గ్రామాలను కూడా దశలవారీగా సర్వే చేసే కార్యక్రమం చేపడుతున్నామని మంత్రి వెల్లడించారు. భూ సర్వేను వేగవంతం చేసేందుకు అత్యాధునిక సాంకేతిక పరికరాలను ప్రభుత్వం పెద్ద ఎత్తున సమకూర్చిందని మంత్రి తెలిపారు. తొలి దశలో కొనుగోలు చేసిన రోవర్లతోపాటు రెండో దశలోనూ అదనపు రోవర్లను సమకూర్చి, జిల్లాల వారీగా అవసరానికి అనుగుణంగా అందిస్తున్నామని చెప్పారు. అలాగే వేలాది మంది సర్వేయర్లకు లైసెన్సులు మంజూరు చేసి క్షేత్రస్థాయిలో సర్వే కార్యక్రమాన్ని వేగవంతం చేస్తున్నామని తెలిపారు. సర్వేయర్లు ఎలాంటి రాజకీయ ప్రచారాన్ని పట్టించుకోకుండా ప్రభుత్వ కార్యక్రమంలో భాగస్వాములై రైతులకు శాశ్వత ప్రయోజనం చేకూర్చాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. దశాబ్దాలుగా సాగులో ఉన్నప్పటికీ సరైన టైటిల్ లేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాల సమస్యలను కూడా గుర్తించి, నిబంధనల ప్రకారం త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించినట్లు మంత్రి తెలిపారు. సాదాబైనామాలు, భూ హద్దుల వివాదాలు, పాత రికార్డుల్లోని లోపాలు, అబాది ఆస్తుల వివరాలు వంటి గ్రామీణ ప్రాంత సమస్యలకు సమగ్ర సర్వే ద్వారా శాశ్వత పరిష్కారం చూపవచ్చన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా రికార్డులు, మ్యాపులను ఆధునీకరించడం భూ భారతి లక్ష్యమన్నారు. గ్రామాల్లో ఇళ్ల స్థలాలు, నివాస ప్రాంతాలు, అబాది ఆస్తులపై గతంలో విస్తీర్ణానికి సంబంధించిన స్పష్టమైన మ్యాపింగ్ లేకపోయిన సందర్భాలు ఉన్నాయని మంత్రి చెప్పారు. ఇకపై సర్వే ద్వారా ఆ ఆస్తి ఎన్ని గజాల్లో ఉంది, దాని హద్దులు ఎక్కడున్నాయి అనే వివరాలను మ్యాప్‌తో సహా రికార్డుల్లో పొందుపరుస్తామని తెలిపారు. భూ భారతి చట్టం అబాది, వ్యవసాయేతర భూములకు ప్రత్యేక రికార్డులు నిర్వహించడం, వాటి మూలలను జియోకోఆర్డినేట్లతో మ్యాప్ చేయడం కోసం నిబంధనలు కలిగి ఉందని వివరించారు.

భూ సమస్యల పరిష్కారంతోపాటు పేదల సొంతింటి కలను సాకారం చేయడంలోనూ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని మంత్రి తెలిపారు. తొలి విడతలో మంజూరైన 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లలో ఇప్పటికే రెండు లక్షలకు పైగా ఇళ్లు పూర్తయ్యాయని, మిగిలిన ఇళ్లను కూడా లక్ష్యబద్ధంగా పూర్తి చేస్తామని చెప్పారు. రెండో విడతలో నిర్మాణం ప్రారంభించే ఇళ్లలో గతంలో అసంపూర్తిగా నిలిచిపోయిన పేదల ఇళ్లకు కూడా ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. గుడిసె లేని రాష్ట్రం చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. రెండో విడతలో అవకాశం రాని అర్హులైన పేదలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఆర్థిక పరిస్థితులు ఎన్ని సవాళ్లు ఎదురైనా మూడో విడత, నాలుగో విడతల ద్వారా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇల్లు అందించే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతుందని మంత్రి స్పష్టం చేశారు.

# గర్భిణులు,బాలింతలకు పౌష్టికాహారంతోనే సత్ఫలితాలు



- **సీడీపీ ఓ వెంకట రమణమ్మ.**

**మెదక్ సెప్టెంబర్,28(సిరి న్యూస్)**

అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే బాలింతలు, గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని సిడిపిఓ వెంకట రమణమ్మ అన్నారు. సోమవారం మెదక్ మండలం పాతూరు సెక్టార్ పరిధిలోని తిమ్మానగర్ అంగన్వాడీ కేంద్రంలో పోషన్ మాసం కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రంలో సామూహిక సీమంతాలు, అన్నప్రసన, అక్షరాభ్యాసాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపీఓ మాట్లాడుతూ.. పౌష్టికాహారం ఆవశ్యకతపై వివరించారు. అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అందించే పౌష్టికాహారాన్ని తీసుకోవాలని సూచించారు. గర్భిణిగా ఉన్న సమయం నుంచి బిడ్డ పుట్టేవరకు టీకాలు ఇవ్వడం, కాన్పు జరిగేంత వరకు ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సేవలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా కోరారు. చిన్నారులకు ఆట పాటలతో పాటు విద్య ను అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐడీసీఎస్ సూపర్‌వైజర్ మాధవి, జిల్లా కో ఆర్డినేటర్ మహేష్, బెతయ్య,సర్పంచ్ యాదగిరి,ఉప సర్పంచ్ కృష్ణ,అంగన్‌వాడీ టీచర్లు,ఆయాలు పాల్గొన్నారు.

# సంస్కార్ విద్యాలయంలో వృక్ష రక్షాబంధన్



**పెద్ద శంకరంపేట, సెప్టెంబర్ 28, (సిరి న్యూస్):**

ప్రకృతి వందన్ సంకల్ప దివస్ సందర్భంగా పెద్ద శంకరంపేట లోని సంస్కార్ విద్యాలయంలో విద్యార్థులు సోమవారం వృక్ష రక్షాబంధన్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి వృక్షాలకు మంగళ హారతులతో ప్రత్యేక పూజలు చేయడంతో పాటు, కంకణాలు కట్టారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరు మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించుకోవాలని పలువురు పేర్కొన్నారు. ప్రకృతిని కాపాడు కోవడానికి ప్రతి ఒక్కరు తమ వంతు కృషి చేయాలన్నారు. నీటిని పొదుపుగా వాడాలని. మొక్కలు నాటాలని. ప్లాస్టిక్ వినియోగం పూర్తిగా తగ్గించాలని వివరించారు. పాఠశాల ఎస్ జి సి ఆధ్వర్యంలో విద్యార్థులు ప్రకృతి సంకల్ప దివస్ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ సీతారామారావు, ప్రిన్సిపల్ కవిత, ఎస్ జి సి ఇంచార్జ్ హైమావతి, జిల్లా పర్యావరణ ప్రముఖ రవి వర్మ, ఖండ పర్యావరణ ప్రముఖ శైలేష్., సతీష్ గౌడ్, సంతోష్ కుమార్, యశోధర్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# మొబైల్ రోబోట్లపై గీతం విద్యార్థులకు శిక్షణ



**పటాన్ చెరు, సెప్టెంబర్ 28, (సిరి న్యూస్);**

రోబోటిక్స్, ఆటోమేషన్ లో అభివృద్ధి చెందుతున్న సాంకేతికతల పై విద్యార్థులకు ఆచరణాత్మక అవగాహన కల్పించేందుకు, గీతం స్కూల్ ఆఫ్ కోర్ ఇంజనీరింగ్ హైదరాబాదులోని మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం స్వయం ప్రతిపత్తి గల మొబైల్ రోబోట్ల పై రెండు రోజుల స్వీయ అనుభవం గడించే కార్యశాల ను విజయవంతంగా నిర్వహించింది. ఈ వర్క్‌షాపులో సుమారు 70 మంది విద్యార్థులు చురుకుగా పాల్గొన్నారు. ముఖాముఖి శిక్షణతో పాటు ఆచరణాత్మక ప్రదర్శనల ద్వారా విలువైన అనుభవాన్ని పొందారు. ఆసక్తికరమైన చర్చలు, ప్రశ్నజవాబు కార్యక్రమాల ద్వారా, స్వయం ప్రతిపత్తి గల మొబైల్ రోబోటిక్స్ పై తమ అవగాహనను మరింత పెంచుకోవడానికి, అలాగే తమ సాంకేతిక సందేహాలను నివృత్తి చేసుకోవడానికి ఈ కార్యశాలలో పాల్గొన్న వారికి అవకాశం లభించింది. వేగంగా అభివృద్ధి చెందుతున్న రోబోటిక్స్, ఆటోమేషన్ రంగంలో ఇది విలువైన అంతర్దృష్టులను అందించిందని పేర్కొంటూ, ఇందులో పాల్గొన్నవారు ఈ కార్యశాల యొక్క ఆచరణాత్మక, పరిశ్రమకు సంబంధించిన విధానాన్ని ప్రశంసించారు. ఈ కార్యక్రమం ద్వారా పొందిన జ్ఞానం, నైపుణ్యాలు తమ కెరీర్ అవకాశాలను విస్తృతం చేసుకోవడానికి, ఈ రంగంలో అభివృద్ధి చెందుతున్న అవకాశాలకు అనుగుణంగా తమను తాము సిద్ధం చేసుకోవడానికి సహాయపడతాయని కూడా వారు తెలిపారు.

# ఏఐ-ఆధారిత ఫార్మకోవిజిలెన్స్‌పై శిక్షణ

- **ఐఐటీ హైదరాబాదు నిపుణులతో గీతం ఫార్మసీ విద్యార్థుల నైపుణ్యాభివృద్ధి**

**పటాన్ చెరు, సెప్టెంబర్ 28, (సిరి న్యూస్):**




ఫార్మాస్యూటికల్ భద్రత, నియంత్రణ వ్యవహారాలు, నియమ పాలనలో కృత్రిమ మేధస్సు (ఏఐ) యొక్క అభివృద్ధి చెందుతున్న అనువర్తనాలపై దృష్టి సారిస్తూ, మేక్‌ఇంటర్న్, ఇసెల్, ఐఐటీ హైదరాబాదు నిపుణులతో గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీ విద్యార్థులకు సెప్టెంబర్ 28 నుంచి 30వ తేదీ వరకు మూడు రోజుల ప్రత్యేక శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఫార్మకోవిజిలెన్స్, ఫార్మాస్యూటికల్ క్వాలిటీ సిస్టమ్స్, రెగ్యులేటరీ సైన్స్ రంగాలలో పనిచేసే మహమ్మద్ హాషీమ్ ఈ కార్యక్రమంలో ప్రధాన శిక్షకుడి గా వ్యవహరిస్తున్నారు. 'ఏఐఆధారిత ఫార్మకోవిజిలెన్స్, వాస్తవ ప్రపంచ ఔషధ భద్రతా విశ్లేషణలు', 'ప్రపంచ నియంత్రణ నిఘా, ఏఐఆధారిత నియమపాలన' అనే రెండు కీలక అంశాలపై విద్యార్థులు శిక్షణ పొందుతున్నారు. ఫార్మకోవిజిలెన్స్, వాస్తవ ప్రపంచ ఔషధ భద్రత, నియంత్రిత నిఘా, ఫార్మాస్యూటికల్ నియమ పాలనలో ఏఐ, డేటాఆధారిత సాంకేతికతల యొక్క అభివృద్ధి చెందుతున్న పాత్రపై విద్యార్థులకు ఆచరణాత్మక అంతర్దృష్టులను అందించడానికి ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. నిపుణులతో నిర్వహించే ఈ శిక్షణ, పరిశ్రమఆధారిత అభ్యాసం ద్వారా, సమకాలీన నియంత్రణ పద్ధతులపై విద్యార్థుల అవగాహనను పెంపొందించడం, వేగంగా మారుతున్న ఫార్మాస్యూటికల్, ఆరోగ్య సంరక్షణ రంగానికి సంబంధించిన నైపుణ్యాలను వారికి అందించడం ఈ కార్యక్రమం యొక్క లక్ష్యం. విద్యను అభివృద్ధి చెందుతున్న పరిశ్రమ అవసరాలతో అనుసంధానించడానికి, అలాగే ఫార్మాస్యూటికల్ సాంకేతికత, నియంత్రణ వ్యవహారాలు, ఏఐఆధారిత ఆరోగ్య సంరక్షణ పరిష్కారాలలో విద్యార్థులలో భవిష్యత్తుకు సిద్ధంగా ఉండే సామర్థ్యాలను పెంపొందించుకోవడానికి వీలు కల్పిస్తున్నారు. ఈ మూడు రోజుల కార్యక్రమం, ఔషధ భద్రత, ప్రపంచ నియంత్రణ నియమ పాలన, భవిష్యత్తును తీర్చిదిద్దుతున్న ప్రస్తుత పోకడలు, సాంకేతికతలు, ఆచరణాత్మక విధానాలతో మమేకమవ్వడానికి గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీ విద్యార్థులకు ఐఐటీ నిపుణులతో ఒక అవకాశాన్ని అందిస్తోంది.

# వినాయక నిమజ్జనంలో నిబంధనల ఉల్లంఘన

- **అధిక శబ్దంతో సౌండ్ సిస్టమ్స్ ట్రాఫిక్ అంతరాయం**
- **డిజిటల్ స్క్రీన్ లు ఏర్పాటు**
- **3 డీజే వాహనాలు సీజ్**
- **యాజమానులు ఆపరేటర్ల పై బిఎన్ఎస్ చట్టం కింద కేసు నమోదు**

**అమీన్పూర్ సెప్టెంబర్ 28 సిరి న్యూస్**




వినాయక నిమజ్జన ఉత్సవాల సందర్భంగా ప్రభుత్వ నియమావలీని తుంగలో తొక్కి, ఎలాంటి అనుమతులు లేకుండా అధిక శబ్దంతో డీజే లు నిర్వహించిన వారిపై అమీన్పూర్ పోలీసులు చట్టపరమైన చర్యలు చేపట్టారు. శబ్ద కాలుష్యానికి కారణమవ్వడమే కాకుండా, ప్రజా శాంతికి భంగం కలిగిస్తూ ట్రాఫిక్ సమస్యలు సృష్టించిన నిందితులపై కేసులు నమోదు చేశారు. ఘటన వివరాలు అమీన్పూర్ పోలీస్ స్టేషన్ సిబ్బంది బీరంగూడ గ్రామంలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా బీరంగూడ గవర్నమెంట్ స్కూల్ సమీపంలోని నందారం నరసింహ గౌడ్ ఇంటి వద్ద ఎలాంటి అనుమతులు లేకుండా డీజే వాహనాలు మరియు భారీ డిజిటల్ స్క్రీన్ లను ఏర్పాటు చేసినట్లు గుర్తించారు. ఈ డీజేలు సెప్టెంబర్ 27 సాయంత్రం ఐదు గంటల నుండి ఉదయం 3 గంటల 30 నిమిషాల వరకు నిరంతరాయంగా అధిక శబ్దంతో కొనసాగాయి. రోడ్డుపైనే భారీ డిజిటల్ స్క్రీన్లు ఏర్పాటు చేయడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడి పోలీసులు ట్రాఫిక్ డైవర్షన్ చేయాల్సిన పరిస్థితి నెలకొంది. సీజ్ చేసిన డీజే వాహనాలు, ఏపీ 39 టిసి 7569, యాజమాని హైజాక్, ఏపీ 12 వి 0661 యాజమాని శామ్సన్, టీఎస్ 12 ఈజే 6440 యాజమాని విజయ్, 3 డీజే వాహనాలను స్వాధీనం చేసుకున్న పోలీసులు యాజమాన్లను మరియు డీజే ఆపరేటర్లను అదుపులోకి తీసుకుని అమీన్పూర్ పోలీస్ స్టేషన్కు తరలించారు. ఘటనకు ప్రధాన కారకూడద్దైన నందారం నరసింహా గౌడ్ తో పాటు, డీజే యాజమానులు, ఆపరేటర్ల పై బిఎన్ఎస్ సెక్షన్లు 223,285,270,292,126 కింద కేసు నమోదు చేయడం జరిగింది అని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించి అధిక శబ్దాలతో సౌండ్ సిస్టం ఏర్పాటు చేస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని అమీన్పూర్ పోలీసులు హెచ్చరించారు.

# డెలివరీ బాయ్స్‌కు కొండాపూర్‌లో 'ఆశ్రయం'

- **పని మధ్యలో సేదతీరేందుకు ప్రత్యేక కేంద్రం**
- **ప్రభుత్వం,అమెజాన్ భాగస్వామ్యంతో ఏర్పాటు**

**శేరిలింగంపల్లి,సెప్టెంబర్ 28 (సిరి న్యూస్):**



నగర ప్రజలకు ఆహారం, నిత్యావసరాలు, ఇతర వస్తువులను నిత్యం చేరవేస్తూ రోడ్లపైనే ఎక్కువ సమయం గడిపే గిగ్, డెలివరీ కార్మికులకు కొండాపూర్‌లో ప్రత్యేక సదుపాయం అందుబాటులోకి వచ్చింది. పని ఒత్తిడి మధ్య కొంతసేపు విశ్రాంతి తీసుకునేందుకు వీలుగా ఏర్పాటు చేసిన 'ఆశ్రయ' కేంద్రాన్ని సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) కమిషనర్ ప్రారంభించారు. తెలంగాణ ప్రభుత్వం, అమెజాన్ ఇండియా సంయుక్త భాగస్వామ్యంతో ఏర్పాటైన ఈ కేంద్రంలో కార్మికులు కొద్దిసేపు ఆగి విశ్రాంతి తీసుకోవడంతో పాటు అవసరమైన ప్రాథమిక సౌకర్యాలను వినియోగించుకునే అవకాశం ఉంటుంది. నగరంలోని ప్రధాన ప్రాంతాల్లో గిగ్ కార్మికులకు అనుకూలమైన వాతావరణం కల్పించాలన్న లక్ష్యంలో భాగంగా ఆశ్రయ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు కొనసాగుతున్నాయి. మెట్రోపాలిటన్ ఏరియా అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ మార్గదర్శకత్వంలో ఈ కార్యక్రమం ముందుకు సాగుతోంది. కొండాపూర్‌లోని కేంద్రాన్ని ఏదైనా ఒక్క డెలివరీ సంస్థకు పరిమితం చేయకుండా వివిధ ప్లాట్‌ఫామ్‌లలో పనిచేసే గిగ్, డెలివరీ కార్మికులు వినియోగించుకునేలా ఏర్పాటు చేశారు. డెలివరీల కోసం నగరమంతా తిరిగే సిబ్బందికి పని మధ్యలో విశ్రాంతి, రీఛార్జ్ వంటి అవసరాలకు ఈ కేంద్రం ఉపయోగపడనుంది. గిగ్ కార్మికుల సంక్షేమం, మెరుగైన పని వాతావరణం కోసం నగరంలోని మరిన్ని ప్రాంతాల్లో ఇలాంటి సౌకర్యాలను విస్తరించే దిశగా చర్యలు కొనసాగుతున్నాయి.

# రాజకీయాలకతీతంగా మెదక్ అభివృద్ధికి కృషి

- **మెదక్‌లోని అన్ని వార్డు సమస్యలకు ప్రాధాన్యత.**
- **మెదక్ మున్సిపల్ జనరల్ బాడీ సమావేశంలో**
- **ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు.**

**మెదక్ సెప్టెంబర్, 28(సిరి న్యూస్)**



రాజకీయాలకతీతంగా మెదక్ అభివృద్ధి కోసం మరిన్ని నిధులతో అన్ని వార్డులను అభివృద్ధి చేసుకుందామని మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు అన్నారు.సోమవారం మెదక్ మున్సిపల్ కార్యాలయంలో జనరల్ బాడీ సమావేశం ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో మున్సిపల్ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, మౌలిక వసతులు, వివిధ వార్డుల్లో నెలకొన్న సమస్యలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు మాట్లాడుతూ.. మెదక్ అభివృద్ధి కోసం అన్ని రాజకీయ పార్టీలకు అతీతంగా పని చేస్తున్నానని తెలిపారు. మెదక్ పట్టణ అభివృద్ధికి అవసరమైన ప్రతి చర్య తీసుకుంటామని, భవిష్యత్తులో మరిన్ని నిధులు మంజూరు చేయించి అభివృద్ధి పనులను వేగవంతం చేస్తామని అన్నారు. ఇప్పటికే కోట్లాది రూపాయల నిధులతో మెదక్‌లో పలు అభివృద్ధి పనులు చేపట్టామని, రాబోయే రోజుల్లో కూడా అవసరమైన నిధులను సమీకరించి పట్టణంలో మౌలిక వసతులను మరింత మెరుగుపరుస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. సమావేశంలో పలువురు మున్సిపల్ కౌన్సిలర్లు తమ తమ వార్డుల్లో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా రోడ్లు, డ్రైనేజీ, పారిశుద్ధ్యం, తాగునీరు, ఇతర మౌలిక వసతులకు సంబంధించిన సమస్యలను వివరించారు. సమస్యలను పరిశీలించి ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించాలని ఎమ్మెల్యే సంబంధిత మున్సిపల్ అధికారులను ఆదేశించారు. మున్సిపల్ పరిధిలో ప్రజలకు ఎదురవుతున్న సమస్యలను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని ఎమ్మెల్యే సూచించారు. అభివృద్ధి పనుల విషయంలో సమన్వయంతో ముందుకు సాగాలని అధికారులకు తెలిపారు .ఈ సమావేశంలో మెదక్ మున్సిపల్ చైర్‌పర్సన్ కానుగు రాధిక భూపతిరాజ్, వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్, మున్సిపల్ కమిషనర్ వై. నవీన్, మున్సిపల్ కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జిన్నారంలో నూతన దుకాణాల నిర్మాణానికి శ్రీకారం

- **స్థానిక వ్యాపారాలకు కొత్త ఊపిరి**
- **ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**

**జిన్నారం సెప్టెంబర్ 28 సిరి న్యూస్**



జిన్నారం మున్సిపల్ కేంద్రంలో ఒక కోటి 80 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించ తలపెట్టిన 33 దుకాణాల సముదాయాల నిర్మాణ పనులకు సోమవారం ఉదయం శంకుస్థాపన చేసిన పటాన్చెరు శాసనసభ్యులు శ్రీ గూడెం మహిపాల్ రెడ్డి . నూతన దుకాణాల ద్వారా మున్సిపాలిటీకి ప్రతి నెల ఆదాయం సమకూరుతుందని తెలిపారు. ఇప్పటికే 15 కోట్ల రూపాయలతో ప్రతి వార్డులో శరవేగంగా అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు అయినప్పుడే సుపరిపాలన సాధ్యమవుతుందని తెలిపారు. జిన్నారం మున్సిపల్ సమగ్ర అభివృద్ధికి తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జనార్ధన్, వైస్ చైర్మన్ ప్రతాప్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ నరేందర్ రెడ్డి, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, సీనియర్ నాయకులు, వివిధ శాఖల అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

# అక్రమ నీటి దోపిడీపై కలెక్టర్‌కు ఫిర్యాదు

- **అనుమతుల్లేకుండా బోర్లు.. ట్యాంకర్లతో నీటి విక్రయం**
- **శాశ్వత చర్యలు తీసుకోవాలని స్థానికుల డిమాండ్**

**రామచంద్రాపురం, సెప్టెంబర్ 28 (సిరి న్యూస్):**





రామచంద్రాపురం మండలం పరిధిలోని తెల్లాపూర్, ఉస్మాన్‌నగర్, పరిసర శివారు ప్రాంతాల్లో అక్రమ నీటి వ్యాపారంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు సంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. అనుమతులు లేకుండా లోతైన బోరుబావులు వేసి భూగర్భ జలాలను తోడుతూ భారీ ట్యాంకర్ల ద్వారా నీటిని విక్రయిస్తున్నారని ఆరోపించారు. అక్రమ బోర్ల కారణంగా భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయని, స్థానికులకు తాగునీటికి సైతం ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. గతంలో రెవెన్యూ, ఇరిగేషన్, ఆర్‌టీఏ, జలమండలి తదితర శాఖల అధికారులకు ఫిర్యాదు చేసినా శాశ్వత పరిష్కారం లభించలేదన్నారు. ఒకట్రెండు చోట్ల జేసీబీలతో బోర్లను పూడ్చడం మినహా పూర్తిస్థాయి చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు.

**అక్రమ బోర్లను శాశ్వతంగా సీజ్ చేయాలి**

మీడియాలో వరుస కథనాలు వచ్చినప్పటికీ అక్రమ నీటి విక్రయం కొనసాగుతోందని స్థానికులు పేర్కొన్నారు. కలెక్టర్ తక్షణమే స్పందించి నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న బోర్లను శాశ్వతంగా సీజ్ చేయాలని కోరారు. వాటి విద్యుత్ కనెక్షన్లు తొలగించడంతో పాటు నీటి అక్రమ విక్రయాలకు పాల్పడుతున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# ఎన్నికల కమిషనర్‌పై కాంగ్రెస్ నిరసన

- **పటాన్‌చెరులో దిష్టిబొమ్మ దహనం..**
- **ఓటర్ల జాబితాపై ఆరోపణలు**

**పటాన్‌చెరు, సెప్టెంబర్ 28 (సిరి న్యూస్):**

కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తొలగించి, అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ పటాన్‌చెరులో కాంగ్రెస్ నాయకులు నిరసన చేపట్టారు. పటాన్‌చెరు జాతీయ రహదారిపై దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా భారత జాతీయ కార్మిక సంఘం, పటాన్‌చెరు పట్టణ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కొల్కూరి నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. ఏఐసీసీ, టీపీసీసీ, డీసీసీ ఆదేశాల మేరకు నిరసన చేపట్టినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల కమిషన్‌పై పలు ఆరోపణలు చేశారు. దేశవ్యాప్తంగా కోట్లాది ఓట్లను ఓటరు జాబితాల నుంచి తొలగించారని, పటాన్‌చెరు నియోజకవర్గంలోనూ సుమారు లక్ష ఓట్లు తొలగించారనే ఆరోపణలతో ప్రజల ఓటు హక్కుకు అన్యాయం జరిగిందని పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో ఉన్న అనుమానాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత కేంద్ర ఎన్నికల సంఘంపై ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ పీసీసీ కార్యదర్శి మతిన్, పట్టణ కాంగ్రెస్ నాయకులు రవి ముదిరాజ్, యువరాజ్ మోరే, సాయిలు ముదిరాజ్, కార్మిక సంఘం నాయకులు రాజు, రతన్‌సింగ్, వినోద్, మల్లేష్, యువజన కాంగ్రెస్ నాయకులు అశోక్ నాయక్, అక్షిత్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



# గేటెడ్ కమ్యూనిటీలపై పోలీసుల ప్రత్యేక నిఘా!

- **ఇంటి దొంగతనాల నివారణకు సెక్యూరిటీ సిబ్బందికి కీలక సూచనలు**

**శేరిలింగంపల్లి,సెప్టెంబర్ 28(సిరి న్యూస్):**




గేటెడ్ కమ్యూనిటీల్లో వరుసగా చోటుచేసుకునే ఇంటి దొంగతనాలకు అడ్డుకట్ట వేసేందుకు చందానగర్ పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. ఇటీవల ఓ గేటెడ్ కమ్యూనిటీలో ఇంటి తాళాలు పగులగొట్టి దొంగతనం జరిగిన నేపథ్యంలో పోలీసు అధికారులు అప్రమత్తమై, చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రధాన గేటెడ్ కమ్యూనిటీలను సందర్శించారు. ఆయా కమ్యూనిటీల మేనేజ్‌మెంట్ ప్రతినిధులు, సెక్యూరిటీ సిబ్బందితో సమావేశమై రాత్రివేళల్లో భద్రతను మరింత పటిష్టం చేయాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు, వాహనాల కదలికలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, సందర్శకుల వివరాలను నమోదు చేయడంతో పాటు సీసీ కెమెరాల పనితీరును నిరంతరం పరిశీలించాలని సూచించారు. దొంగలు అనుసరించే విధానాలు, ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తూ ప్రత్యేక అవగాహన పోస్టర్లను కూడా అందుబాటులోకి తీసుకొచ్చారు. కమ్యూనిటీల్లో భద్రతా లోపాలను గుర్తించి సరిదిద్దేలా యాజమాన్యాలకు సూచనలు చేసిన పోలీసులు, దొంగతనాల పునరావృతిని అడ్డుకునేందుకు నిరంతర పర్యవేక్షణ, ముందస్తు చర్యలు కొనసాగుతాయని చందానగర్ ఎస్‌హెచ్‌ఓ తెలిపారు.

# 22ఏ నిషేధిత జాబితా నుంచి పట్టా భూములను తొలగించాలి

- **ప్రజావాణిలో అధికారులకు అనంతారం ప్రజాప్రతినిధుల వినతి**

**గుమ్మడిదల, సెప్టెంబర్ 28 సిరి న్యూస్ ) :**

గుమ్మడిదల మండల పరిధిలోని అనంతారం గ్రామ పరిధిలోని పట్టా భూములను 22ఏ నిషేధిత ఆస్తుల జాబితా నుంచి తొలగించి బాధిత రైతులకు న్యాయం చేయాలని కోరుతూ గ్రామ సర్పంచ్ కొమ్ము శ్రీను, ఉప సర్పంచ్ యాదిరెడ్డి అధికారులకు విజ్ఞప్తి చేశారు. సోమవారం గుమ్మడిదల మండల కేంద్రంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఎంపీడీవో ఉమాదేవికి వారు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ అనంతారం పరిధిలోని కొన్ని పట్టా భూములను 22ఏ నిషేధిత ఆస్తుల జాబితాలో చేర్చడంతో ఆయా భూముల యజమానులు తమ ఆస్తులపై చట్టబద్ధమైన లావాదేవీలు నిర్వహించడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. సదరు భూములకు సంబంధించి స్వాతంత్ర్య సమరయోధులకు ప్రభుత్వం చేసిన భూ కేటాయింపుల రికార్డులతో పాటు, రెవెన్యూ డివిజనల్ అధికారి జారీ చేసిన అనుమతులు, నిరభ్యంతర పత్రాలు, రిజిస్టర్డ్ విక్రయ పత్రాలు, హక్కు పత్రాలు అందుబాటులో ఉన్నాయని వారు వివరించారు. అయినప్పటికీ ఆయా భూములు 22ఏ నిషేధిత జాబితాలో ఉండటంతో ప్రస్తుత భూ యజమానులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సంబంధిత రెవెన్యూ రికార్డులను సమగ్రంగా పరిశీలించి, ప్రభుత్వ భూ కేటాయింపు వివరాలు, ఆర్డీవో ఉత్తర్వులు, నిరభ్యంతర పత్రాలు, రిజిస్టర్డ్ విక్రయ పత్రాలు, హక్కు పత్రాలను పరిశీలించాలని కోరారు. అన్ని ఆధారాలను పరిశీలించిన అనంతరం అర్హత కలిగిన పట్టా భూములను 22ఏ నిషేధిత ఆస్తుల జాబితా నుంచి తొలగించి, ప్రస్తుత భూ యజమానులు తమ చట్టబద్ధమైన హక్కులను స్వేచ్ఛగా వినియోగించుకునేలా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.




# పాదయాత్ర చేసిన స్పందించని ప్రభుత్వం

- **తక్షణ ఉపశమనం కొరకు తాత్కాలిక మరమ్మత్తులు**
- **వెల్దుర్తి నుండి చెట్టుపల్లి వరకు గుంతల రోడ్డుకు మరమ్మత్తులు**
- **శాసన సభ్యురాలు సునీత రెడ్డి**

**వెల్దుర్తి, సెప్టెంబర్ 28, (సిరి న్యూస్):**

వెల్దుర్తి-మెదక్ రోడ్డు దుస్థితిపై స్పందించిన ఎమ్మెల్యే సునీత రెడ్డి వెల్దుర్తి నుండి మెదక్ వరకు రహదారి అధ్వానంగా మారి ప్రజల ప్రయాణం నరకప్రాయంగా మారిందని మండల నాయకులు నర్సాపూర్ శాస సభ్యురాలు సునీత రెడ్డి కి తెలియజేయడంతో ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ఆగస్టు నెలలో వెల్దుర్తి నుండి శెట్టిపల్లి వరకు సుమారు 12 కిలో మీటర్లు పాదయాత్ర చేసి, మెదక్ కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి రోడ్డును బాగు చేయాలని డిమాండ్ చేసిన ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి మండల ప్రజలు నెల రోజులు గడిచినా ప్రభుత్వం నుంచి శాశ్వత పరిష్కారంపై స్పందన లేకపోవడంతో పరిస్థితి మరింత దారుణంగా మారింది. కొన్ని ప్రాంతాల్లో రెండు మూడు అడుగుల లోతైన గుంతలు ఏర్పడి వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వ్యాపారస్తులు, ఉద్యోగస్తులు,కాలేజీ విద్యార్థినీ,విద్యార్థులకు ఇట్టి రోడ్డు వలన తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వెల్దుర్తి మండల నాయకుల ద్వారా తెలుసుకొని ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించి సోమవారం బిఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు భూపాల్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి రమేష్ గౌడ్,మాజీ వైస్ చైర్మన్ కృష్ణ గౌడ్, వెన్నవరం శ్రీనివాస్ రెడ్డిలు నిలబడి తక్షణ ఉపశమనంగా తాత్కాలిక మరమ్మత్తులుగా గుంతలపై టిప్పర్ల ద్వారా కంకర పొడిని పోయిస్తూ పనులు మొదలుపెట్టారు. ఇట్టి వి షయమై మండల ప్రజలు స్పందిస్తూ ఎమ్మెల్యే సునిత లక్ష్మారెడ్డికి, మండల నాయకుల కు కృతజ్ఞతలు తెలియజేశారు.



# పట్టభద్రుల ఓటరు నమోదుకు నవంబర్ 6 డెడ్‌లైన్



- **-శేరిలింగంపల్లి నియోజకవర్గంలో కొత్తగా ఓటరు జాబితా తయారీ**

**శేరిలింగంపల్లి,సెప్టెంబర్ 28 (సిరి న్యూస్):**

రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి నియోజకవర్గ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గానికి ఓటరు జాబితాను డినోవో విధానంలో కొత్తగా రూపొందించనున్న నేపథ్యంలో అర్హులైన పట్టభద్రులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని అధికారులు సూచించారు. ఇందుకోసం ఫారం-18 ద్వారా నవంబర్ 6, 2026లోగా సంబంధిత ఎన్నికల నమోదు అధికారి, సహాయ ఎన్నికల నమోదు అధికారి లేదా నియమిత అధికారులకు దరఖాస్తు చేసుకోవాలి. భారత పౌరుడై, సంబంధిత నియోజకవర్గ పరిధిలో సాధారణ నివాసిగా ఉండటంతో పాటు 2026 నవంబర్ 1 నాటికి కనీసం మూడేళ్ల క్రితం డిగ్రీ లేదా సమాన అర్హత పొందిన వారు నమోదు చేసుకునేందుకు అర్హులు. దరఖాస్తుతో డిగ్రీ సర్టిఫికెట్, మార్కుల మెమో లేదా ఇతర ధ్రువపత్రాలను సమర్పించాలి. ముఖ్యంగా గత జాబితాలో పేరు ఉన్న పట్టభద్రులు సైతం ఈసారి మళ్లీ ఫారం-18 దాఖలు చేయాల్సి ఉంటుందని అధికారులు స్పష్టం చేశారు. సంబంధిత అధికారుల వద్ద నేరుగా దరఖాస్తు చేసుకోవడంతో పాటు తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లోనూ నమోదు చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. అర్హులైన ప్రతి పట్టభద్రుడు గడువు లోపు దరఖాస్తు చేసుకుని ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవాలని మియాపూర్ సర్కిల్ 48 ఉప కమిషనర్ శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు.

# బకాయిల వసూళ్లకోసం వెళ్లి.. అదృశ్యమైన కాంట్రాక్టర్

- **మాదాపూర్‌లో అవదేష్‌కుమార్ కోసం పోలీసుల గాలింపు**

**శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 28 (సిరి న్యూస్):**



మాదాపూర్ సిద్ధిక్‌నగర్‌లో నివసించే గ్లాస్ వర్క్ లేబర్ కాంట్రాక్టర్ అవదేష్‌కుమార్ (29) అదృశ్యమైన ఘటనపై మాదాపూర్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. బీహార్‌కు చెందిన అవదేష్‌కుమార్ గత కొంతకాలంగా గ్లాస్ వర్క్ కాంట్రాక్టర్‌గా పనిచేస్తున్నాడు. గతంలో ఫోనెక్స్ కంపెనీ వద్ద చేపట్టిన పనికి సుమారు రూ.5 లక్షల బకాయిలు రావాల్సి ఉండటంతో వాటిని తీసుకునేందుకు ఈ నెల 24న ఉదయం 10.30 గంటలకు తన నివాసం నుంచి బయలుదేరినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అయితే రాత్రి అయినా ఇంటికి చేరుకోకపోవడంతో బంధువులు, పరిచయస్తుల వద్ద ఆరా తీస్తూ పరిసర ప్రాంతాల్లో గాలించినా ఆచూకీ లభించలేదు. అనంతరం ఫోనెక్స్ కంపెనీ వద్ద విచారించగా, అవదేష్ ఆ రోజు కార్యాలయానికి రాలేదని సిబ్బంది తెలిపినట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. దీంతో అతని సోదరుడు మిథిలేష్‌కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, అవదేష్ సుమారు 5.5 అడుగుల ఎత్తు, గోధుమ వర్ణంతో ఉంటాడని, హిందీ, మైథిలి భాషలు మాట్లాడతాడని వివరాలు అందించారు. ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసుకున్న పోలీసులు అదృశ్యమైన వ్యక్తి ఆచూకీ కోసం గాలిస్తూ, అతను చివరిగా వెళ్లిన మార్గం, పరిచయస్తులు, అందుబాటులో ఉన్న ఇతర వివరాలపై ఆరా తీస్తున్నారు.

# గణేశుని లడ్డు వేలంపాటలో దక్కించుకోవడం మా అదృష్టంగా భావిస్తున్నాం



- **మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ సిహెచ్ శ్రీనివాస్ గౌడ్.**

**సదాశివపేట.సెప్టెంబర్ 28. (సిరిన్యూస్)**



సదాశివపేట పాత కేరి లోని నవ సమాజ్ యూత్ అసోసియేషన్ గణేశుని లడ్డు వేలం పాట వేయడం జరిగింది. ఈ సందర్భంగా మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ సిహెచ్ శ్రీనివాస్ గౌడ్ తనయుడు సిహెచ్ ఈశ్వర్ గౌడ్ 1 లక్ష 21 వెయ్యి రూపాయలకు దక్కించుకోవడం జరిగింది. ఈ సందర్భంగా సిహెచ్ శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ గణేశుని లడ్డు వేలంపాటలో తనకు రావడం అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. ఈ లడ్డు మహా ప్రసాదం భక్తులకు పంచడం జరుగుతుందని, ఆ విగ్నేశ్వరుని దయవల్ల ప్రతి ఒకరికి విఘ్నాలు తొలగిపోయి చల్లంగా ఉండాలని కోరుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యులు మునిపల్లి సత్యనారాయణ, కౌన్సిలర్ ఫణి కృష్ణ, కంది కృష్ణ, నాగరాజు గౌడ్, నరసింహ గౌడ్,వీరేందర్ గౌడ్, గణేష్ గౌడ్ ,రమేష్ గౌడ్ ,ప్రవీణ్ గౌడ్, సన్ని గౌడ్ ,పాలనేత్ర గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# అండర్ 14 మెదక్ జిల్లా క్రికెట్ టీమ్ కు శ్రీధర్ ఎంపిక

**జోగిపేట, సెప్టెంబర్ 28, (సిరి న్యూస్):**



అండర్ 14 ఉమ్మడి మెదక్ జిల్లా క్రికెట్ టీంకు జోగిపేటకు చెందిన శ్రీధర్ ఎంపికయ్యారు. పుల్కల్ మండలం ముదిమానిక్ గ్రామానికి చెందిన విద్యార్థి శ్రీధర్ జోగిపేటలోని హై స్కూల్ గ్రౌండ్ లో జోగిపేట అవెంజర్ క్రికెట్ అకాడమీ లో కోచ్ శివకుమార్ పర్యవేక్షణ లో క్రీడా మెలకువలు నేర్చుకుంటున్నారు. శ్రీధర్ ప్రతిభను గుర్తించిన జిల్లాస్థాయి బాలుర అండర్ 14 జట్టు నిర్వాహకులు ఎంపిక చేశారు. సంగారెడ్డిలో జరిగిన సెలక్షన్స్ ఎంపికైనట్లు కోచ్ తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం స్థానిక హై స్కూల్ గ్రౌండ్ లో మెదక్ జిల్లా స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపిక కావడం పట్ల శ్రీధర్ ను కోచ్ శాలువాతో సత్కరించి కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కోచ్ మాట్లాడుతూ జిల్లా స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపిక కావడం ఎంతో ఆనందంగా ఉందని ఆయన అన్నారు. భవిష్యత్తులో తన నైపుణ్యాన్ని ప్రదర్శించి ఉన్నత స్థాయికి చేరుకుంటారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# గేటెడ్ కమ్యూనిటీలపై పోలీసుల ప్రత్యేక నిఘా!



- **ఇంటి దొంగతనాల నివారణకు సెక్యూరిటీ సిబ్బందికి కీలక సూచనలు**

**శేరిలింగంపల్లి,సెప్టెంబర్ 28(సిరి న్యూస్):**

గేటెడ్ కమ్యూనిటీల్లో వరుసగా చోటుచేసుకునే ఇంటి దొంగతనాలకు అడ్డుకట్ట వేసేందుకు చందానగర్ పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. ఇటీవల ఓ గేటెడ్ కమ్యూనిటీలో ఇంటి తాళాలు పగులగొట్టి దొంగతనం జరిగిన నేపథ్యంలో పోలీసు అధికారులు అప్రమత్తమై, చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రధాన గేటెడ్ కమ్యూనిటీలను సందర్శించారు. ఆయా కమ్యూనిటీల మేనేజ్‌మెంట్ ప్రతినిధులు, సెక్యూరిటీ సిబ్బందితో సమావేశమై రాత్రివేళల్లో భద్రతను మరింత పటిష్టం చేయాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు, వాహనాల కదలికలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, సందర్శకుల వివరాలను నమోదు చేయడంతో పాటు సీసీ కెమెరాల పనితీరును నిరంతరం పరిశీలించాలని సూచించారు. దొంగలు అనుసరించే విధానాలు, ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తూ ప్రత్యేక అవగాహన పోస్టర్లను కూడా అందుబాటులోకి తీసుకొచ్చారు. కమ్యూనిటీల్లో భద్రతా లోపాలను గుర్తించి సరిదిద్దేలా యాజమాన్యాలకు సూచనలు చేసిన పోలీసులు, దొంగతనాల పునరావృతిని అడ్డుకునేందుకు నిరంతర పర్యవేక్షణ, ముందస్తు చర్యలు కొనసాగుతాయని చందానగర్ ఎస్‌హెచ్ఓ తెలిపారు.

# కనిపించని వ్యక్తి – ఆచూకీ కోసం విజ్ఞప్తి

**వెల్దుర్తి,సెప్టెంబర్ 28, (సిరి న్యూస్):**



వెల్దుర్తి మండలం ధర్మారం గ్రామానికి చెందిన బొడ్డు కృష్ణ ,50 సంవత్సరాలు, తేది 27.09.2026 రాత్రి సుమారు 08:00 గంటల సమయంలో కుటుంబ సభ్యులతో గొడవ పడి ఇంట్లో నుంచి వెళ్ళిపోయాడు. ఎంత సేపు ఎదురు చుసిన ఇంటికి తిరిగి రాలేదు,కుటుంబ బంధువులు, పరిసర ప్రాంతాల్లో వెతికినప్పటికీ అతని ఆచూకీ లభించలేదు. ఎత్తు సుమారు 5.4అడుగులు, చామన్ ఛాయ, ఇంటి నుంచి వెళ్లేటప్పుడు గ్రే కలరు షర్ట్ , గ్రీన్ నైట్ ప్యాంట్ ధరించి ఉన్నాడు అతని కొడుకు దుర్గప్రసాద్ పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. అతని ఆచూకీ తెలిసిన వారు పోలీస్ స్టేషన్‌కు 8712657890 కి సమాచారం అందించగలరు అని వెల్దుర్తి ఎస్సై కరుణాకర్ రెడ్డి తెలిపారు.

# ప్రజావాణి అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించాలి

- **జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్.**

**మెదక్ సెప్టెంబర్, 28(సిరి న్యూస్)**



ప్రజావాణిలో వివిధ సమస్యలతో వచ్చే ప్రజల అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు.సోమవారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మెయిన్ కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన ప్రజావాణిలో డి.ఆర్వో అంబ దాస్ రాజేశ్వర్, జడ్పీ సీఈఓ ఎల్లయ్య, డిఆర్డిఓ పిడి శ్రీనివాసరావు తో కలిసి కలెక్టర్ ప్రజల ఫిర్యాదులను స్వీకరించి, పరిశీలించారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుండి వచ్చిన (91) అర్జీలను కలెక్టర్ స్వీకరించారు. వచ్చిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులకు కేటాయిస్తూ, ప్రజా సమస్యలపై

తగిన చర్యలు తీసుకొని, త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేయాలని అధికారులకు సూచించారు.ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారాలను వేగవంతం చేయాలని, పెండింగ్ లో లేకుండా దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. ఈ ప్రజావాణిలో వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# మెదక్ పట్టణ అభివృద్ధికి పార్టీలకతీతంగా సహకరిస్తాం.

- **9వ వార్డు కౌన్సిలర్ జుబేర్ అహ్మద్.**
- **అథ్లెటిక్ స్టేడియం అభివృద్ధి, చిల్డ్రన్స్ పార్క్ ఆధునీకరణ, బస్తీ దవాఖానా ప్రారంభానికి ఎమ్మెల్యేకు వినతి.**

**మెదక్ సెప్టెంబర్,28(సిరి న్యూస్)**



మెదక్ పట్టణ అభివృద్ధికి పార్టీలకతీతంగా సహకరిస్తామని 9 వ వార్డు కౌన్సిలర్ జుబేర్ అహ్మద్ తెలిపారు. సోమవారం మెదక్ మున్సిపల్ సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే రోహిత్ రావు ముఖ్య అతిథిగా హాజరవగా మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్, కమిషనర్ సమక్షంలో నిర్వహించారు. ఈ సమావేశంలో 9వ వార్డు కౌన్సిలర్ జుబేర్ అహ్మద్ వార్డులోని సమస్యలతో పాటు మెదక్ పట్టణ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. మెదక్ పట్టణ ప్రజలు వాకింగ్,పోలీస్ శిక్షణ కోసం ఉపయోగించుకునే అథ్లెటిక్ స్టేడియంలో పరిశుభ్రత, టాయిలెట్, తాగునీటి సదుపాయాలు కల్పించాలని కోరారు. అలాగే పట్టణంలోని చిల్డ్రన్స్ పార్కును అభివృద్ధి చేసి పిల్లలకు ఆటస్థలంగా, మహిళలకు వాకింగ్‌కు అనుకూలంగా తీర్చిదిద్దాలని విజ్ఞప్తి చేశారు. అలాగే చిల్డ్రన్స్ పార్క్ వెనుక నూతనంగా నిర్మించిన బస్తీ దవాఖానాలో ప్రారంభం నుంచి వైద్యులు, సిబ్బంది, మందులు అందుబాటులో లేవని, ప్రజలకు వైద్య సేవలు అందేలా వెంటనే దవాఖానాను ప్రారంభించాలని ఎమ్మెల్యేను కోరారు. 9వ వార్డులో సీసీ రోడ్ల పనులకు ఎమ్మెల్యే రోహిత్ రావు ముందుకు రావడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, మెదక్ పట్టణ అభివృద్ధి కోసం చేపట్టే పనులకు పార్టీలకతీతంగా పూర్తి సహకారం అందిస్తామని జుబేర్ అహ్మద్ తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం, పట్టణ అభివృద్ధి కోసం అందరూ కలిసి పనిచేయాలని ఆయన పేర్కొన్నారు.

# వంజరి సంఘం నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక..

- **అధ్యక్షుడిగా సొంగని సుధాకర్.**
- **ప్రధాన కార్యదర్శిగా ఆముద నరేష్, కోశాధికారిగా నాగరాజు.**

**రామాయంపేట, సెప్టెంబర్ 28 (సిరి న్యూస్)**





రామాయంపేట పట్టణ వంజరి సంఘం 2026-28 సంవత్సరానికి నూతన కార్యవర్గాన్ని సోమవారం యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయం వద్ద ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా సొంగని సుధాకర్, ప్రధాన కార్యదర్శిగా ఆముద నరేష్, కోశాధికారిగా సొంగని నాగరాజు ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా సరిదే రాజు, పిబి మనోహర్, సహాయ కార్యదర్శులుగా సరిదే వెంకటేశం, ఆముద సత్యనారాయణ ఎన్నికయ్యారు. సలహాదారులుగా నవాత్ నాగేశ్వర్, నవాత్ ప్రభాకర్, జుంగె సత్యనారాయణ, నవాత్ చిన్న శ్రీనివాస్, నవాత్ కిరణ్ కుమార్, నవాత్ నవీన్ కుమార్, నవాత్ రాజేంద్రప్రసాద్, పటేరి వాసులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ.. వంజరి సంఘం అభివృద్ధికి ఐక్యంగా కృషి చేస్తామని తెలిపారు. సంఘ సభ్యుల సంక్షేమంతో పాటు సామాజికంగా సంఘాన్ని మరింత బలోపేతం చేసేందుకు తమ వంతు కృషి చేస్తామని పేర్కొన్నారు.

# ఎవరికి మేలు ఎవరికి కీడు







- **జాతీయ రహదారి 765 డి**
- **రోజుకో ప్రమాదం*గడచిన ఆరు నెలలలో 30కి పైగా రోడ్డు ప్రమాదంలో మృతి* అంతారం టు కొల్చారం**

**కొల్చారం సెప్టెంబర్ 28 (సిరి న్యూస్)**



కొల్చారం నుండి కొత్త రహదారి 765 డి గండి మైసమ్మ వరకు విస్తరించడంతో నిత్యం ఏదో ఒకచోట పారి ప్రమాదాలే జరుగుతూ ఉన్నాయి. రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసులు తనిఖీలు నిర్వహిస్తున్న ప్రమాదాలు మాత్రం ఏ మాత్రం తగ్గడం లేదు రెండు నెలల మధ్యలో కౌడిపల్లి మండలం అంతారం నుండి కొల్చారం మండలం కృష్ణాపూర్ రాంపూర్ వరకు ఎక్కువ రోడ్డు ప్రమాదంలో మృతుల సంఖ్య రోజుకు రోజుకు పెరుగుతూ ఉన్నాయి పోతంశెట్టిపల్లి గ్రామానికి చెందిన ఏసు భ 75 అదే గ్రామానికి చెందిన బట్టి కిష్టయ్య ఆటోలు గ్రామానికి వస్తుండగా ఎదురుగా ఎదురుగా వస్తున్న వాహనం ఢీకొనడంతో ఘటన స్థలం లోనే మృతి చెందారు ఐఎంఎల్ డిపోలో పని చేస్తున్న మరో ఇద్దరు కార్మికులు శ్రీధర్ రెడ్డి నగేష్ రాంపూర్ వద్ద అమృత్ గౌడ్ ఆయన కుమారుడు అల్లుడు ద్విచక్ర వాహనంపై మెదక్ వైపు వెళ్తుండగా మృతి చెందారు ఆదివారం నాడు అప్పాజీపల్లి గ్రామానికి చెందిన సూర్యకాంత్ 40 ద్విచక్ర వాహనంపై ఇంటికి వస్తుండగా డివైడర్ను ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందారు కౌడిపల్లి మండలం అంతారం గేట్ వద్ద ఓ దున్నపోతు కొమ్ములతో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వారిని ప్రమాదవశాత్తు పడవటంతో ఘటన స్థలంలోని మృతి చెందడం అందరినీ కంటతడి పెట్టించింది జాతీయ దహ దారి విస్తరించడంతోనే జాతీయ రహదారి విస్తరించడంతో 20 25 సంవత్సరంలో గండి మైసమ్మ నుండి కొల్చారం మండలం వరకు 1000కి పైన మృతి చెంది ఉంటారని మరో 10 వేలమంది తీవ్రంగా గాయపడినట్లు పోలీస్ శాఖ ఓ అంచనాకు వచ్చింది వాహనదారులు సైతం అతివేగం నిర్లక్ష్యం రోడ్డు నిబంధనలు పాటించకపోవడం వల్లే తరచూ రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయి రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు పోలీస్ రెవెన్యూ వివిధ శాఖల అధికారులు. వాహనదారులకు సూచనలు సలహాలు ఎస్సీ బాగుంటుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు

**కొల్చారం ఎస్సై మొహిముద్దీన్ వివరణ**

తరచూ జరుగుతున్న రోడ్డు ప్రమాదాలపై స్థానిక ఎస్సై మొహినొద్దీన్ ను వివరణ కోరగా ఎప్పటికప్పుడు పోలీస్ శాఖ తరపున వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నామని ఎక్కువ రోడ్డు ప్రమాదాలు దిశక్ర వాహనాల వల్లే జరుగుతున్నాయని మద్యం సేవించి నడపడం వల్ల కూడా జరుగుతున్నట్లు వాటిని అరికట్టేందుకు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహిస్తున్నామని జైలు కూడా పంపుతున్నట్లు ప్రమాదాల నివారణకు మరిన్ని కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన సిరి తో అన్నారు

# శ్రీ లక్ష్మి నృసింహస్వామి ఆలయంలో చోరీ !!

- **4.5 కిలోల వెండి ఆభరణాలు అపహరణ!**

**శివంపేట్ సెప్టెంబర్ 28(సిరి న్యూస్ )**



మెదక్ జిల్లాలోని శివంపేట మండలం సికింద్లాపూర్ గ్రామంలో ఉన్న ప్రసిద్ధ శ్రీ లక్ష్మి నృసింహ స్వామి ఆలయంలో గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడటం కలకలం రేపింది. ఆలయంలోకి ప్రవేశించిన దుండగులు స్వామివారికి సంబంధించిన విలువైన వెండి ఆభరణాలను అపహరించినట్లు సమాచారం. ఆలయంలోని మకర తోరణం, కిరీటం, పాదాలు తదితర వెండి ఆభరణాలను గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లినట్లు ఆలయ నిర్వాహకులు గుర్తించారు. మొత్తం సుమారు 4.5 కిలోల మేర వెండి ఆభరణాలు చోరీకి గురైనట్లు ప్రాథమికంగా తెలుస్తోంది. ఆలయంలో చోరీ జరిగిన విషయం వెలుగులోకి రావడంతో స్థానికులు, భక్తులు ఆందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని ఆలయ పరిసరాలను పరిశీలించారు. చోరీ జరిగిన తీరును, దుండగులు ఆలయంలోకి ఏ మార్గంలో ప్రవేశించారు, ఎలా బయటకు వెళ్లారు అనే అంశాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. అలాగే ఆలయం పరిసరాల్లో ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలిస్తూ, చోరీకి పాల్పడిన వ్యక్తులను గుర్తించే దిశగా దర్యాప్తు కొనసాగిస్తున్నారు. దుండగులు ముందస్తు ప్రణాళికతోనే చోరీకి పాల్పడ్డారా? ఆలయం గురించి పూర్తి అవగాహన ఉన్న వ్యక్తుల ప్రమేయం ఉందా? అనే కోణాల్లోనూ పోలీసులు విచారణ చేపడుతున్నట్లు తెలుస్తోంది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. చోరీకి గురైన వెండి ఆభరణాల పూర్తి వివరాలు, వాటి విలువ తదితర అంశాలపై అధికారులు వివరాలు సేకరిస్తున్నారు. ప్రముఖ ఆలయంలో స్వామివారి ఆభరణాలు చోరీకి గురికావడంతో సికింద్లాపూర్ గ్రామంలో చర్చనీయాంశంగా మారింది. చోరీకి పాల్పడిన నిందితులను త్వరగా గుర్తించి, అపహరించిన ఆభరణాలను తిరిగి స్వాధీనం చేసుకోవాలని స్థానికులు, భక్తులు కోరుతున్నారు. ప్రస్తుతం ఘటనపై పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది. నిందితులను గుర్తించేందుకు అందుబాటులో ఉన్న ఆధారాలను పోలీసులు అన్ని కోణాల లో పరిశీలిస్తున్నారు.

# బస్సు ఎక్కుతుండగా ప్రమాదం..

- **విద్యార్థినికి తీవ్ర గాయాలు..**

**హత్నూర, సెప్టెంబర్ 28 (సిరి న్యూస్):**

దౌల్తాబాద్ ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సు ఎక్కుతున్న సమయంలో ప్రమాదం చోటుచేసుకుని కళాశాల విద్యార్థినికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలకు వెళితే నర్సాపూర్ మండలం కాగజ్ మద్దూరు గ్రామానికి చెందిన కుసంగి సంజన (17) అనే విద్యార్థిని హత్నూర మండలం దౌల్తాబాద్ లోని సాయి రిషి ఒకేషనల్ కళాశాలలో చదువుతోంది. సోమవారం సాయంత్రం కళాశాల నుంచి ఇంటికి వెళ్లేందుకు దౌల్తాబాద్ ఆర్టీసీ బస్టాండ్‌కు చేరుకుంది. ఈ క్రమంలో టీ జీ 30 జెడ్ 0002 నంబర్ గల బస్సు ఎక్కుతుండగా, డ్రైవర్ బస్సును ముందుకు కదిలించడంతో సంజన అదుపుతప్పి క్రింద పడింది. బస్సు టైరు కాలు పైనుంచి వెళ్లడంతో కాలుకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు, తోటి విద్యార్థులు ఆమెను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. డ్రైవర్ నిర్లక్ష్యమే ప్రమాదానికి కారణమని స్థానికులు ఆరోపించారు.



# చీఫ్ ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలి

- సంగారెడ్డిలో కదం తొక్కిన కాంగ్రెస్ శ్రేణులు
- భారీ ర్యాలీ, సభ నిర్వహించి అడిషనల్ కలెక్టర్ కు వినతి పత్రం సమర్పణ
- ఓట్ల తొలగింపే లక్ష్యంగా సర్ : ఎంపీ సురేష్ షెట్కార్
- అర్హులైన ఒక్క ఓటు కూడా తొలగిపోకూడదు: నిర్మలా జగ్గారెడ్డి
- ఓటర్ల హక్కుల పరిరక్షణకు బూత్ స్థాయిలో అప్రమత్తంగా ఉండాలి : చంద్రశేఖర్ రెడ్డి




**సంగారెడ్డి, సెప్టెంబర్ 28 :**

ఓటర్ల జాబితా నుంచి అర్హులైన ఓట్లను తొలగించడమే లక్ష్యంగా ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (SIR) ప్రక్రియ కొనసాగుతోందని మెదక్ ఎంపీ సురేష్ షెట్కార్ ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం పిలుపు మేరకు సంగారెడ్డి జిల్లా కేంద్రంలో ఓట్ల గల్లంతు, ఎన్నికల కమిషన్‌పై నిరసనగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. రామ్ నగర్ రామ్ మందిర్ వద్ద గల జగ్గారెడ్డి ఇంటి నుండి మొదలుకుని పాత బస్టాండ్ అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ చేశారు. బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నాయకులు, కార్యకర్తలు ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన సభలో ఎంపీ సురేష్ షెట్కార్, డీసీసీ అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి, నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి, మాజీ డీసీసీ అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడారు. అనంతరం జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కలెక్టర్ కార్యాలయం లో అడిషనల్ కలెక్టర్ కు వినతి పత్రం అందజేశారు

**ఓట్ చోరీపై దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పోరాటం: సురేష్ షెట్కార్**

ఎంపీ సురేష్ షెట్కార్ మాట్లాడుతూ.. ఓట్ చోరీ అంశంపై కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా పోరాటం చేస్తోందన్నారు. ఎన్నికల సమయంలో పార్లమెంట్‌లో ధర్నాలు, ఆందోళనలు నిర్వహించినప్పటికీ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తమ కార్యక్రమాలను కొనసాగించిందని ఆరోపించారు. బీహార్, బెంగాల్ ఎన్నికల్లో భారీగా ఓట్లను తొలగించి బీజేపీ అధికారంలోకి వచ్చిందని ఆయన ఆరోపించారు. ప్రస్తుతం దక్షిణాది రాష్ట్రాల్లోనూ సర్ పేరుతో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ కొనసాగుతోందని, తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ ఈ ప్రక్రియపై అప్రమత్తంగా ఉందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు హక్కును కాపాడాల్సిన అవసరం ఉందని, ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఎన్నికల వ్యవస్థ చర్యలు తీసుకోవాలని సురేష్ షెట్కార్ కోరారు.

**అర్హులైన ఒక్క ఓటు కూడా తొలగిపోకూడదు: నిర్మలా జగ్గారెడ్డి**

మాజీ డీసీసీ అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ సర్ ప్రక్రియలో పెద్ద సంఖ్యలో ఓటర్లకు అభ్యంతరాలు, నోటీసులు రావడం ఆందోళన కలిగిస్తోందన్నారు. ముఖ్యంగా మైనారిటీలు, ఎస్సీలు, పేదలు, బలహీన వర్గాలకు చెందిన అర్హులైన ఓటర్ల ఓట్లు తొలగిపోకుండా చూడాల్సిన బాధ్యత ఎన్నికల వ్యవస్థపై ఉందన్నారు. ఏళ్లుగా ఒకే ప్రాంతంలో నివసిస్తూ, నిరంతరం ఓటు హక్కును వినియోగించుకుంటున్న వారికి సైతం నోటీసులు రావడానికి కారణమేంటని ఆమె ప్రశ్నించారు. క్షేత్రస్థాయిలో బూత్‌ల వారీగా పరిశీలిస్తే ఓటర్లకు నోటీసులు రావడం, వివిధ రకాల ధ్రువపత్రాలు సమర్పించాలని కోరడం వంటి అంశాలు తమ దృష్టికి వస్తున్నాయని తెలిపారు.

**బూత్ స్థాయిలో అప్రమత్తంగా ఉండాలి: చంద్రశేఖర్ రెడ్డి**

డీసీసీ అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను కాంగ్రెస్ పార్టీ నిశితంగా పరిశీలిస్తోందన్నారు. ప్రతి బూత్‌లో ఓటర్ల వివరాలను పరిశీలించి, అర్హులైన ఓటర్ల పేర్లు జాబితాలో ఉన్నాయా లేదా అన్నది నిర్ధారించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మెదక్ కంటెస్టెడ్ ఎంపీ నీలం మధు, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాటా సుధారాణి, సంగారెడ్డి జిల్లా నలుమూలల నుండి వచ్చిన కాంగ్రెస్ శ్రేణులు భారీ ఎత్తున పాల్గొన్నారు.

# కలెక్టరేట్ వద్ద కాంగ్రెస్ ధర్నా





- ఓటు హక్కు పరిరక్షణ, ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని డిమాండ్.
- ఏఐసీసీ,పీసిసి పిలుపుతో భారీ ర్యాలీ.
- మోడీ, అమిత్ షా,ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ ల దిష్టిబొమ్మ దగ్ధం.

**మెదక్ సెప్టెంబర్,28(సిరి న్యూస్)**

ఓటు హక్కును పరిరక్షించడంతో పాటు ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని డిమాండ్ చేస్తూ.. మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఆందోళనలో మెదక్ ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ రావు పాటు నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ ఆవుల రాజిరెడ్డి, దుబ్బాక ఇంచార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డితో పాటు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ఎన్నికల సంఘం తీరును నిరసిస్తూ కాంగ్రెస్ శ్రేణులు నినాదాలు చేశారు. ధర్నా సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ దిష్టిబొమ్మలను కాంగ్రెస్ శ్రేణులు దహనం చేశారు. జ్ఞానేష్ కుమార్ ని వెంటనే పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియకు సంబంధించి కాంగ్రెస్ పార్టీ పలు అంశాలపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తుందని అన్నారు. ఓటర్ల జాబితా సవరణకు సంబంధించిన అంశాలపై ఎన్నికల సంఘం సమగ్ర వివరణ ఇవ్వాలని కోరారు. డీసీసీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో మెదక్ మున్సిపల్ చైర్మన్ కానుగు రాధిక భూపతి రాజ్, వైస్ చైర్మన్ దొంతి నరేష్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గంగాధర్, మైనార్టీ కమిషన్ చైర్మన్ సుఫీ జానీ, ఎన్ఎస్ యుఐ జిల్లా అధ్యక్షుడు అక్షయ్ గౌడ్, మెదక్ జిల్లా అన్ని మండలల పార్టీ అధ్యక్షులు, నాయకులు కార్యకర్తలు కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# క్రీడలతో విద్యార్థుల్లో సమగ్ర వికాసం

- గుమ్మడిదల మండల స్థాయి హైస్కూల్ ఫెడరేషన్ గేమ్స్ ప్రారంభం
- విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి: మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్



**గుమ్మడిదల, సెప్టెంబర్ 28 (సిరి న్యూస్):**

విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికి తీసి, వారిని జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించేలా ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్ అన్నారు. గుమ్మడిదలలోని శ్రీవివేకానంద విద్యాలయం ప్రాంగణంలో సోమవారం నిర్వహించిన మండల స్థాయి హైస్కూల్ ఫెడరేషన్ గేమ్స్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు క్రీడా పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. క్రీడా పోటీలను ప్రారంభించిన అనంతరం కుమార్ గౌడ్ మాట్లాడుతూ విద్యార్థుల జీవితంలో చదువుతో పాటు క్రీడలకు కూడా ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసం, క్రమశిక్షణ, సమయ పాలన, పట్టుదల, జట్టుగా పనిచేసే తత్వాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. గెలుపు, ఓటములను సమానంగా స్వీకరించే మనస్తత్వం క్రీడల ద్వారా అలవడుతుందని తెలిపారు. ప్రతి విద్యార్థిలో ఏదో ఒక ప్రత్యేక ప్రతిభ దాగి ఉంటుందని, దానిని గుర్తించి ప్రోత్సహించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులపై ఉందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులకు క్రీడల్లో మంచి అవకాశాలు లభిస్తే వారు ఉన్నత స్థాయికి ఎదగగలరని చెప్పారు. మండల స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు తదుపరి స్థాయిలోనూ విజయం సాధించి గుమ్మడిదల ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. క్రీడల్లో పాల్గొనే విద్యార్థులకు అవసరమైన ప్రోత్సాహం అందించేందుకు ప్రజాప్రతినిధులు, విద్యాశాఖ అధికారులు, పాఠశాలల యాజమాన్యాలు సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు. విద్యార్థులు మొబైల్ ఫోన్లు, ఇతర అనవసర విషయాలకు దూరంగా ఉంటూ చదువుతో పాటు క్రీడలపై కూడా దృష్టి సారించాలని సూచించారు. ఈ సందర్భంగా వివిధ పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థులు ఉత్సాహంగా క్రీడా పోటీల్లో పాల్గొన్నారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఎంపిక చేసి తదుపరి స్థాయి పోటీలకు పంపించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. విద్యార్థులు క్రీడాస్ఫూర్తితో పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను చాటాలని ఉపాధ్యాయులు సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ సంధ్య, కౌన్సిలర్లు మాధవి, కుమార్ గౌడ్, మండల విద్యాధికారి పౌలిన, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, క్రీడా నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయురాలి డిప్యుటేషన్ రద్దు చేయాలి

- హత్నూర పాఠశాల విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకోవాలి: సర్పంచ్ ఎల్లయ్య

**హత్నూర, సెప్టెంబర్ 28 (సిరి న్యూస్):**

సంగారెడ్డి జిల్లా హత్నూర మండలంలోని ఎంపీపీఎస్ హత్నూర పాఠశాలలో పనిచేస్తున్న ఎస్‌జీటీ ఉపాధ్యాయురాలు పి. జ్యోతి డిప్యుటేషన్ ఉత్తర్వులను రద్దు చేయాలని హత్నూర గ్రామ సర్పంచ్ నల్లోల్ల ఎల్లయ్య జిల్లా విద్యాధికారిని కోరారు. ఈ మేరకు సోమవారం జిల్లా విద్యాధికారికి విజ్ఞప్తి పత్రం సమర్పించారు.

ఈ సందర్భంగా సర్పంచ్ ఎల్లయ్య మాట్లాడుతూ.. పి. జ్యోతి ఉపాధ్యాయురాలు హత్నూర పాఠశాలకు వచ్చినప్పటి నుంచి పలుమార్లు ఇతర ప్రాంతాలకు డిప్యుటేషన్‌పై వెళ్లారని, ప్రస్తుతం మరోసారి అమీన్‌పూర్‌కు డిప్యుటేషన్ ఉత్తర్వులు పొందినట్లు తెలిపారు. ఆమెను మరో ప్రాంతానికి పంపితే పాఠశాలలో విద్యాబోధనకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పండుగ రవికుమార్, చెక్క రాజు, నల్లోల్ల నగేష్, వల్లి గారి నరసింహ తదితరులు పాల్గొన్నారు.





# మయూరీనగర్‌లో ఘనంగా స్టార్ బీబీక్యూ ప్రారంభం

**రామచంద్రపురం, సెప్టెంబర్ 28(సిరి న్యూస్) :**

రామచంద్రాపురం డివిజన్‌లోని మయూరీనగర్ కాలనీలో సోల్ బైట్స్ ఫుడ్ కోర్ట్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన స్టార్ బీబీక్యూను బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదర్శ్ రెడ్డితో కలిసి ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ అంజిరెడ్డి, మాజీ కార్పొరేటర్లు బూరుగడ్డ పుష్పనాగేశ్, తొంట అంజయ్య, గూడెం మధుసూదన్ రెడ్డి, వెన్నవరం సంతోష్ రెడ్డి, కుమార్ గౌడ్, మల్లేశం గౌడ్, అశ్విన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. వినియోగదారులకు రుచికరమైన, నాణ్యమైన ఆహారాన్ని అందించేందుకు స్టార్ బీబీక్యూలో ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.




# అమితాషా చేతుల మీదగా అమూల్ మిల్క్ డైరీ భూమి పూజ



- మెదక్ ఎంపీ రఘునందన్ రావు స్థల పరిశీలన

**తూప్రాన్ సెప్టెంబర్ 28 సిరి న్యూస్**

తూప్రాన్ మున్సిపల్ పరిధిలోని 10 వ వార్డు వెంకటాపూర్ శివారు రైల్వే గేటు వద్ద అక్టోబర్ 4వ తేదీన అమూల్ మిల్క్ సంస్థకు కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా భూమి పూజ కార్యక్రమానికి వస్తున్నట్లు మెదక్ ఎంపీ రఘునందన్ రావు తెలిపారు అమూల్ రాకతో మెదక్ జిల్లాలో ఉన్న పాడి పశువు రైతులకు ప్రయోజనం లాభం కలుగుతుంది స్థానిక ప్రజలకు అనేక ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని ఎంపీ అన్నారు మెదక్ జిల్లా కు అమూల్ మిల్క్ డైరీ రావడానికి మెదక్ ఎంపీ రఘునందన్ రావు కృషిని జిల్లా బిజెపి నాయకులు అభినందించారు శంకుస్థాపన కార్యక్రమానికి సంబందించిన స్థలాన్ని మెదక్ ఎంపీ రఘునందన్ రావు తూప్రాన్ అర్ డి ఓ బావయ్య డిఎస్పీ నరేందర్ గౌడ్ ఎస్ఐ గంగరాజు నయాబ్ తాసిల్దార్ శ్రీకాంత్ ఆర్ఐ ప్రేమ్ కుమార్ సంబంధిత అధికారులు మెదక్ జిల్లా అధ్యక్షులు రాధామల్లేష్ గౌడ్ రాంమోహన్ గౌడ్ జానకిరామ్ గౌడ్ బిజెపి నాయకులు కార్యక్రమంలో పాల్గొన్నారు

# సీసీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి



- జిల్లా కలెక్టర్ కు వినతి..

**హత్నూర, సెప్టెంబర్ 28 (సిరి న్యూస్):**

హత్నూర మండలం నవాబుపేట గ్రామ పంచాయతీ పరిధిలో సీసీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయడంతో పాటు అదనపు వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ సోమవారం జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌కు ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు. గ్రామంలో రహదారుల అభివృద్ధి కోసం సీసీ రోడ్డు నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని, రైతులకు వడ్ల విక్రయంలో ఇబ్బందులు తలెత్తకుండా అదనంగా వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని వినతి పత్రంలో కోరారు. ముఖ్యంగా పంట కాలంలో రైతులు దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి లేకుండా గ్రామంలోనే అదనపు కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నవాబుపేట సర్పంచ్ ఎరుకలి బుచ్చయ్య, ఉప సర్పంచ్ జక్కుల బాబయ్య, అన్వర్ హుస్సేన్, జైన్ శివ గ్రామస్తులు ఉన్నారు.

# రక్షణ చర్యలతోనే నేరాల నియంత్రణ



- రాత్రిపూట గస్తీ తీవ్రతరం చేయాలి
- గేటెడ్ సొసైటీలకు సిఐ కీలక సూచనలు

**జిన్నారం సెప్టెంబర్ 28 సిరి న్యూస్**

ఐడిఏ బొల్లారం సర్కిల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గేటెడ్ కమ్యూనిటీల నివాసితులతో మరియు కమ్యూనిటీ ప్రతినిధులు, సెక్యూరిటీ సిబ్బందితో సోమవారం సిఐ సుధీర్ కుమార్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ రాత్రిపూట సెక్యూరిటీ గార్డులు మరింత అప్రమత్తంగా ఉండాలని, కమ్యూనిటీ పరిధిలో నిర్ణీత సమయాలు గస్తీ పెట్రోలింగ్ తిరగాలని ఆయన స్పష్టం చేశారు. కొత్తగా వచ్చేవారు అనుమానస్పదంగా తిరిగే వ్యక్తుల వివరాలను నమోదు చేసుకోవాలని ఏమాత్రం అనుమానం వచ్చినా వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని ఆదేశించారు. ప్రవేశ నిష్క్రమణ ద్వారాలతో పాటు మైదాన ప్రాంతాల్లో సీసీటీవీ కెమెరాలు నిరంతరం పనిచేసేలా చూసుకోవాలని బ్యాకప్ డేటా భద్రపరచాలని ఆయన సూచించారు. ఇళ్లకు తాళాలు వేసి ఊర్లకు వెళ్లే నివాసితులు ఆ విషయాన్ని స్థానిక పోలీస్ స్టేషన్కు సమాచారం ఇవ్వాలని పిలుపునిచ్చారు. కమ్యూనిటీల సెక్యూరిటీ విభాగం నిరంతర సమన్వయంతో పనిచేస్తే దొంగతనాల నుంచి పూర్తి రక్షణ పొందవచ్చని ఆయన పేర్కొన్నారు. ఏదైనా అనుమానస్పద వ్యక్తి వాహనం లేదా చోరీ ప్రయత్నం కనిపిస్తే వెంటనే డయల్ 112 కు లేదా ఐడియా బొల్లారం పోలీస్ స్టేషన్కు సమాచారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# సర్కారు బడులను టిపిఎస్ పేరుతో మూసేస్తే సహించం




- పేద పిల్లల విద్యా హక్కుల కోసం ఉద్యమిస్తాం
- మాజీ ఎస్ టియు అధ్యక్షుడు బి. భుజంగరావు, BRS సీనియర్ నేత దేవీప్రసాద్

**సంగారెడ్డి: సెప్టెంబర్ 28 (సిరి న్యూస్)**

తెలంగాణలోని ప్రభుత్వ పాఠశాలలను తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ టిపిఎస్ పేరుతో విలీనం చేసి, పాఠశాలల సంఖ్యను తగ్గించే ప్రతిపాదనలను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని మాజీ ఎస్ టియు అధ్యక్షుడు, బిఆర్ఎస్ నేత బి. భుజంగరావు డిమాండ్ చేశారు. పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లలకు విద్యను అందుబాటులో ఉంచాల్సిన ప్రభుత్వం.. ఉన్న పాఠశాలలను తగ్గించడం ద్వారా వారి విద్యా హక్కులను దెబ్బతీయకూడదని ఆయన అన్నారు. ఆర్టీఈ నిబంధనల ప్రకారం ఒకటి నుండి ఐదవ తరగతి విద్యార్థులకు ఒక కిలోమీటర్ పరిధిలో, ఆరు నుంచి ఎనిమిదవ తరగతి విద్యార్థులకు మూడు కిలోమీటర్ల పరిధిలో పాఠశాల అందుబాటులో ఉండేలా చూడాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా గ్రామాలు, తండాలు, మారుమూల ప్రాంతాల్లో పాఠశాలలు మూసివేస్తే చిన్నారులు ప్రతిరోజూ ఎక్కువ దూరం ప్రయాణించాల్సి వస్తుందని, దీనివల్ల డ్రాప్‌ఔట్స్ పెరిగే ప్రమాదం ఉందని భుజంగరావు పేర్కొన్నారు. "సర్కారు బడులను బలోపేతం చేయాలి కానీ మూసివేయకూడదు. విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉంటే అందుకు కారణాలను గుర్తించి ఉపాధ్యాయులను, మౌలిక వసతులను పెంచాలి. బడిని మూసివేయడం సమస్యకు పరిష్కారం కాదు" అని ఆయన స్పష్టం చేశారు. బిఆర్ఎస్ సీనియర్ నేత దేవీప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల సంఖ్యను తగ్గించే ప్రతిపాదనపై ప్రభుత్వం ప్రజలకు పూర్తి వివరాలు వెల్లడించాలని డిమాండ్ చేశారు. ప్రతి నియోజకవర్గంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు చేయడం పేరుతో ఇప్పటికే ఉన్న స్థానిక ప్రభుత్వ పాఠశాలలను విలీనం చేయడం వల్ల పేద విద్యార్థులకు ఇబ్బందులు ఎదురవుతాయని అన్నారు.

# ఎమ్మెల్యేను కలిసిన ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు



- నూతన అధ్యక్షుడు చిట్యాల అక్షయ్ గౌడ్ ను అభినదించిన ఎమ్మెల్యే రోహిత్ రావు.

**మెదక్ సెప్టెంబర్, 28(సిరి న్యూస్)**

ఇటీవల నూతనంగా మెదక్ జిల్లా ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన వెల్దుర్తి మండలం మన్నెవర్ జాలాల్‌పూర్ గ్రామానికి చెందిన చిట్యాల అక్షయ్ గౌడ్ సోమవారం మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు ను డిసిసి అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్ ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందించి ఆశీర్వాదాలు తీసుకున్నారు. అనంతరం విద్యార్థుల సమస్యలు,ఎన్ఎస్‌యూఐ కార్యకలాపాలు, భవిష్యత్ కార్యక్రమాలపై వివరించారు. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పార్టీ కార్యకలాపాలలో క్రియాశీలకంగా పనిచేస్తానని తెలిపారు.నా ఎన్నికకు కృషి చేసిన పెద్దలందరికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఎన్ఎస్‌యూఐ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థి దశ నుండి క్రీడల్లో రాణించాలి

- ఘనంగా ప్రారంభమైన మండల స్థాయి పోటీలు
- ఆటల్లో గెలుపోటములు సహజం
- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

**జిన్నారం సెప్టెంబర్ 28 సిరి న్యూస్**




జిన్నారం మున్సిపల్ కేంద్రంలోని గిరిజన గురుకుల బాలుర పాఠశాలలో ఏర్పాటుచేసిన 70వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండల స్థాయి క్రీడా పోటీలను సోమవారం ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి కొద్దిసేపు వాలీబాల్ ఆడి అందరినీ ఉత్సాహపరిచారు. అనంతరం క్రీడాకారుల నుండి గౌరవ వందనం స్వీకరించి క్రీడాజ్యోతి వెలిగించి క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి క్రీడల పై ఆసక్తి పెంపొందించుకోవాలి చదువుతోపాటు క్రీడలు జీవితంలో ఒక భాగం కావాలి అని ఆయన తెలిపారు. క్రీడలు మానసిక ఒత్తిడిని తగ్గించి శారీరక దృఢత్వాన్ని ఇస్తాయని, గెలుపోటములను సమానంగా స్వీకరించే క్రీడా స్ఫూర్తిని క్రమశిక్షణను అలవాటు చేస్తాయని ఆయన తెలిపారు. ఇప్పటిలో మండల పరిధిలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల నుండి పెద్ద సంఖ్యలో విద్యార్థులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జనార్దన్ ముదిరాజ్, వైస్ చైర్మన్ ప్రతాప్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ నరేందర్ రెడ్డి, వాడు కౌన్సిలర్లు కోఆప్షన్ సభ్యులు సీనియర్ నాయకులు వ్యాయామ ఉపాధ్యాయులు క్రీడాకారులు విద్యార్థులు పాల్గొన్నారు.

# పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా పట్టివేత

**వెల్దుర్తి, సెప్టెంబర్ 28, (సిరి న్యూస్):**



వెల్దుర్తి మండలం మంగళపర్తి గ్రామంలో పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు చేసి తరలిస్తున్న వాహనాన్ని వెల్దుర్తి పోలీసులు పట్టుకున్నారు. ఆదివారం సాయంత్రం అందిన సమాచారంతో పోలీసులు TG30T6192 వాహనాన్ని తనిఖీ చేయగా, అందులో పీడీఎస్అనంతరం ఇట్టి వాహనాన్ని సీజ్ చేసి సివిల్ సప్లైస్ ఇన్‌స్పెక్టర్ తాటి నర్సింలు సమక్షంలో తనిఖీ నిర్వహించి 3 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం, 3.60 క్వింటాళ్ల బియ్యం నూకలు, వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. వాహన డ్రైవర్ తేజావత్ నవీన్ ను విచారించగా, బియ్యం,వాహనం తేజావత్ విఠల్‌కు చెందినవని,తెలిపాడు. తక్కువ ధరకు పీడీఎస్ బియ్యాన్ని కొనుగోలు చేసి ఇటుక బట్టీలకు విక్రయించేందుకు తరలిస్తున్నట్లు వెల్లడించాడు. ఈ ఘటనపై వెల్దుర్తి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# క్రీడలతోనే యువతకు ఉజ్వల భవిష్యత్తు

- మహదేవరెడ్డి సేవలు అభినందనీయం
- వాలీబాల్ కోర్టును ప్రారంభించిన ఎమ్మెల్యే

**అమీన్పూర్ సెప్టెంబర్ 28 సిరి న్యూస్**



అమీన్పూర్ డివిజన్ పరిధిలోని పీజేఆర్ కాలనీలో మాధవపురి హిల్స్ ఐదవ వార్డు మాజీ కౌన్సిలర్ కొత్తపల్లి మహదేవరెడ్డి తన సొంత ఖర్చులతో నూతనంగా నిర్మించిన వాలీబాల్ కోర్టును సోమవారం ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి తో కలిసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక యువత క్రీడాకారుల సౌకర్యార్థం మాజీ కౌన్సిలర్ మహదేవ రెడ్డి తన సొంత నిధులతో ఈ వాలీబాల్ కోర్టును ఏర్పాటు చేయడం పట్ల ప్రత్యేక అభినందనలు తెలిపారు. పదవిలో ఉన్న లేకపోయినా ప్రజలకు యువతకు ఉపయోగపడే అభివృద్ధి సేవా కార్యక్రమాలు చేయడం, మరియు ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలని ఆయన అన్నారు. క్రీడలు శారీరక మానసిక వికాసానికి ఎంతో దోహదపడతాయనీ , అందుబాటులోకి వచ్చిన ఈ కోర్టును లోకల్ సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దేవానంద్ ముదిరాజ్, కొల్లూరి చంద్రకళ, గోపాల్ ముదిరాజ్, తలారి రాములు ముదిరాజ్, ప్రజా ప్రతినిధులు కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు యువకులు క్రీడాకారులు పాల్గొన్నారు.

# ఇంటి నిర్మాణానికి పర్మిషన్ ఇప్పించండి

- పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్ తో కుమ్మక్కై అడ్డుకుంటున్నారు.
- గుమ్మాల నరసింహారెడ్డి దంపతుల ఆవేదన.
- న్యాయం చేయకుంటే చావే శరణ్యం.
- జిల్లా కలెక్టర్ కు వేడుకలు.

**మెదక్ సెప్టెంబర్,28(సిరి న్యూస్)**



నా స్వంత జాగలో ఇంటి నిర్మాణం చేపట్టడానికి పర్మిషన్ కోరగా పంచాయతీ సెక్రెటరీ గ్రామ సర్పంచ్ తో కుమ్మక్కై నానా ఇబ్బందులకు గురిచేస్తున్నారని వృద్ధ దంపతులు సోమవారం కలెక్టర్ ను వేడుకున్నారు.హవేలిఘనపూర్ మండలం వాడి గ్రామానికి చెందిన గుమ్మాల పుష్పమాల నర్సింహా రెడ్డి కి వాడి గ్రామం లో తమ పూర్వికుల నుండి సంక్రమించిన స్వంత జాగా కలదు.ఆ స్థలంలో ఇల్లు నిర్మాణం చేపడదామని పంచాయతీ సెక్రెటరీకి పర్మిషన్ గురించి దరఖాస్తు చేసుకోగా గ్రామ సర్పంచ్ తో కుమ్మక్కై పర్మిషన్ ఇవ్వకుండా అడ్డుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.గ్రామంలో అందరికీ పర్మిషన్ ఇస్తూ మాకు మాత్రమే అడ్డంకులు చెప్తున్నారని తెలిపారు. ఇట్టి విషయంపై మేము ప్రశ్నించగా ఎవరికి చెప్పుకుంటావో చెప్పుకోపో అని అసభ్య పదజాలంతో దురుసుగా ప్రవర్తిస్తున్నారు. సంబంధిత మండల ఎంపీడీవో కార్యాలయంలో దరఖాస్తు సమర్పించగా నేటి వరకు ఎలాంటి చర్య తీసుకోలేదన్నారు.ఇట్టి విషయంలో క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి మా యొక్క నూతన గృహ నిర్మాణానికి పర్మిషన్ ఇప్పించగలరని కలెక్టర్ ను వేడుకున్నారు.

# మెదక్ పెద్ద చర్చ్‌లో భక్తిశ్రద్ధలతో స్త్రీల మైత్రి ఆరాధన





**మెదక్, సెప్టెంబర్ 28 సిరి న్యూస్**

మెదక్ పట్టణంలోని చర్చ్ ఆఫ్ సౌత్ ఇండియా మహాదేవాలయంలో స్త్రీల మైత్రి ఆరాధన కార్యక్రమం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా జరిగింది. చర్చి ఫార్మేషన్ డే సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఉదయం నుంచే మహాదేవాలయ ప్రాంగణానికి మహిళలు చేరుకోవడంతో అక్కడ ఆధ్యాత్మిక సందడి నెలకొంది. ఏసుప్రభువును స్తుతిస్తూ మహిళలు భక్తి గీతాలు ఆలపించారు. స్తుతి గీతాలకు అనుగుణంగా కోలాటాలు ఆడుతూ మహిళలు ఉత్సాహంగా ఆరాధనలో పాల్గొన్నారు. పాటలు, ప్రార్థనలు, కోలాటాలతో మహాదేవాలయ ప్రాంగణం మార్మోగింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన మహిళలు ఒకే చోట చేరి ఏసుప్రభువును ఆరాధించడం కార్యక్రమంలో ప్రత్యేకంగా కనిపించింది. స్త్రీల మైత్రి ఆరాధనలో భాగంగా మహిళలు పరస్పరం ఆత్మీయంగా పలకరించుకుంటూ మైత్రిని చాటుకున్నారు. కుటుంబాల్లో శాంతి, సంతోషాలు నెలకొనాలని, సమాజంలో ప్రేమ, ఐక్యత పెరగాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఏసుక్రీస్తు బోధించిన ప్రేమ, క్షమ, సేవా మార్గాలను గుర్తుచేసుకుంటూ విశ్వాసంతో ప్రార్థనలు నిర్వహించారు. మహిళలు సమూహాలుగా నిలబడి స్తుతి గీతాలు పాడుతూ, కోలాటాలు ఆడుతూ ఆరాధనలో పాల్గొనడంతో మహాదేవాలయ ప్రాంగణం పండుగ వాతావరణాన్ని తలపించింది. చిన్నారుల నుంచి వృద్ధ మహిళల వరకు పలువురు కార్యక్రమంలో పాల్గొని ఆరాధనలో భాగస్వాములయ్యారు. చర్చి ఫార్మేషన్ డే సందర్భంగా నిర్వహించిన స్త్రీల మైత్రి ఆరాధన మహిళలలో ఆధ్యాత్మికతతో పాటు పరస్పర మైత్రి, ఐక్యతను చాటేలా సాగింది. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన మహిళలతో మెదక్ పెద్ద చర్చ్చ ర్చ్ ఆఫ్ సౌత్ ఇండియా మహాదేవాలయ ప్రాంగణం రోజంతా భక్తి గీతాలు, ప్రార్థనలతో సందడిగా కొనసాగింది

## భర్తను హత్య చేసిన కేసులో జీవిత ఖైదు

- భార్య ఆమె తండ్రికి జీవిత ఖైదు.రూ.5 వేల జరిమానా

**తూప్రాన్ సెప్టెంబర్ 28 సిరి న్యూస్**

తూప్రాన్ మండలం ఘనపూర్‌కు చెందిన దొడ్ల వెంకటేష్ తన భార్య విజయ ఇద్దరు కుమార్తెలతో కలిసి నివాసం ఉంటున్నారు కొంతకాలంగా కుటుంబ విషయాలపై భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతుండగా 01.09.2023న రాఖీ పండుగ సందర్భంగా విజయ తండ్రి నర్సింలు ఇతర బంధువులతో కలిసి వెంకటేష్ ఇంటికి వచ్చారు. అదే రోజు రాత్రి సమయంలో వెంకటేష్‌పై దాడి చేసి కొబ్బరి తాళ్లు చున్నీతో కట్టేసి చిత్రహింసలు పెట్టి వేడి నీళ్లు పోసి గదిలో ఉంచి తాళం వేసి వెళ్లిపోయారు ఈ విషయాన్ని విజయ ఫోన్ ద్వారా వెంకటేష్‌తమ్ముడికి తెలియజేయడంతో రామంతాపూర్‌కు చెందిన శ్రీనివాస్ ఘనపూర్‌కు చేరుకుని గది తాళం పగలగొట్టి వెంకటేష్‌ను తూప్రాన్ ఆస్పత్రికి తరలించగా వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ వెంకటేష్ మృతి చెందాడు. వెంకటేష్ సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి తూప్రాన్ ఎస్ఐ శివానందం కేసు నమోదు చేసి అప్పటి తూప్రాన్ సీఐ, దర్యాప్తు అధికారి శ్రీధర్ సమగ్ర దర్యాప్తు చేపట్టి కీలక సాక్ష్యాధారాలను సేకరించారు. కేసు విచారణ సమయంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెంకటేష్ బలమైన వాదనలు వినిపించి ప్రస్తుత దర్యాప్తు అధికారి వెంకట రాజాగౌడ్ ఎస్ఐ గంగరాజు సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. పోలీసులు సమర్పించిన సాక్ష్యాధారాలను పరిశీలించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ నిందితులు విజయ నర్సింలుకు జీవిత ఖైదుతో పాటు రూ.5 వేల చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు. కేసులో నిందితులకు శిక్ష పడేలా సమర్థవంతంగా దర్యాప్తు చేసి సాక్ష్యాధారాలను సేకరించి కోర్టులో ప్రవేశపెట్టిన అధికారులు సిబ్బందిని అదనపు ఎస్పీ విక్రాంత్‌కుమార్ సింగ్ అభినందించారు. నేరం చేసిన నిందితులకు చట్ట ప్రకారం శిక్ష పడేలా పోలీసు శాఖ నిరంతరం కృషి చేస్తుందని ఆయన తెలిపారు. ఈ కేసులో కోర్టు లైజనింగ్ అధికారులు ఎస్ఐ విట్టల్ కానిస్టేబుల్ రవీందర్‌గౌడ్ సీడీఓ నాగరాజు సహకరించినట్లు అదనపు ఎస్పీ తెలిపారు

The imprint line should be printed legibly as Printed by Published by BADHE JAYASHREE on behalf of BADHE JAYASHREE, printed at and published at PLOT NO. 104, KAPIL KAUSALYA APARTMENT, SHILPA CERENY COUNTY VENCHER, POTHIREDDYPALLY, editor BADHE JAYASHREE.

www.siridaily.com

RNI TG TEL/ 26/A0381

# సిరి

People's Voice వార్తపత్రిక

మంగళవారం
సెప్టెంబర్-29-2026

సంపుటి (Volume) : 2
సంచిక (Issue) 270

పేజీలు : 5


## పెద్ద శంకరంపేట పశు వైద్యశాలకు మహర్దశ

- పరిశీలించిన పశు వైద్య అధికారిణి మౌనిక, కాంగ్రెస్ నేత మురళి పంతులు
- వెంటనే మరమ్మతు పనులు ప్రారంభం




2




# 'రియల్' మాఫియా.. అధికారుల మాయ!

### ఇసితాబాద్ వెంచర్లో నిధుల మాయాజాలం

4

- అభివృద్ధి శూన్యం.. మార్టిగేజ్ ప్లాట్లు రిలీజ్ ఎలా?
- కోట్ల విలువైన ఆస్తి చేజార్చిన పంచాయతీ
- రహదారులు, వాటర్ ట్యాంక్, డ్రైనేజీ లేకున్నా ఫైనల్ అనుమతులు
- బెటర్‌మెంట్, డెవలప్‌మెంట్ చార్జీల వసూళ్లపై స్పష్టత కరవు
- సీసీ కెమెరాలకు రూ.20 వేలు లేవన్న పంచాయతీ
- ప్రత్యేక అధికారి పాలనలోనే కీలక సంతకాలంటూ ఫిర్యాదులు
- షోకాజ్ నోటీసులతో చేతులు దులుపుకుంటున్న అధికారులు
- సర్పంచ్, కార్యదర్శి, డీటీసీపీ అధికారుల పాత్రపై విచారణకు డిమాండ్

సదాశివపేట మండలం ఇసితాబాద్ గ్రామ పంచాయతీ పరిధిలోని భారీ వెంచర్‌కు సంబంధించి మార్టిగేజ్ ప్లాట్ల విడుదల వ్యవహారం రోజురోజుకూ పెను దుమారం రేపుతోంది. పంచాయతీరాజ్, డీటీసీపీ నిబంధనల ప్రకారం వెంచర్ పరిధిలో వంద శాతం మౌలిక అభివృద్ధి పనులు పూర్తి చేసి, ఉన్నతాధికారుల నుంచి తుది ఆమోదం పొందిన తర్వాతే గ్రామ పంచాయతీ ఆధీనంలో ఉన్న మార్టిగేజ్ ప్లాట్లను విడుదల చేయాల్సి ఉంటుంది. కానీ ఇసితాబాద్‌లో కనీస అభివృద్ధి పనులు చేపట్టకుండానే కోట్ల రూపాయల విలువైన ప్లాట్లను విడుదల చేసేశారంటూ స్థానిక గ్రామస్తులు, ఫిర్యాదుదారులు తీవ్రస్థాయిలో మండిపడుతున్నారు. లేఅవుట్‌లో అంతర్గత బీటీ లేదా సీసీ రహదారులు, ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంక్, భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ, వీధి దీపాలు, తాగునీటి సరఫరా వంటి కనీస వసతులు క్షేత్రస్థాయిలో దర్శనమివ్వడం లేదని, అయినా అధికారులు గుట్టుచప్పుడు కాకుండా ప్లాట్లను ఎలా క్లియర్ చేశారని నిలదీస్తున్నారు.

సదాశివపేట, సెప్టెంబర్ 28 (సిరిన్యూస్)




## అక్రమ క్రషర్లపై కలెక్టర్‌కు ఫిర్యాదు!

### క్రషర్లతో దెబ్బతింటున్న ఇండ్లు

### సిరి కథనంతో కలెక్టర్కు ఫిర్యాదు చేసిన గ్రామస్తులు

5

- దుమ్ము ధూళితో రోగాల బారిన జనం
- కలెక్టర్కు గ్రామస్తుల మొర
- బాధ్యులపై చర్యలకు డిమాండ్
- గ్రామాలను మింగేస్తున్న క్రషర్ల ధుమ్ము
- పేలుళ్లకు బీటలు వారుతున్న ఇళ్లు



## 'అందోలు'లో పునర్విభజన ఫీవర్!

3

### నియోజకవర్గంలో మారుతున్న రాజకీయ సమీకరణలు

### 1967 నుంచి ఎస్సీ రిజర్వుడ్‌గానే కొనసాగుతున్న అందోలు స్థానం.. రెండుగా చీలే అవకాశం..




- అందోలు జనరల్, అల్లాదుర్గం ఎస్సీ రిజర్వుడు?
- కాంగ్రెస్‌లో మంత్రి దామోదర రాజనర్సింహ కుటుంబానికే తొలి ప్రాధాన్యత
- జనరల్ మహిళ అయితే త్రిష దామోదర్ బరిలో నిలిచే ఛాన్స్?
- బీఆర్ఎస్‌లో టికెట్ కోసం జైపాల్‌రెడ్డి, భిక్షపతి, నారాయణ ముదిరాజ్ ఆశలు
- హరీష్‌రావు, కేటీఆర్, కేసీఆర్ ఆశీస్సులంటూ ఎవరికి వారు ప్రచారం
- జనరల్ అయితే నేనెందుకు పోటీ చేయకూడదంటున్న క్రాంతికిరణ్
- మహిళా కోటా వస్తే మంజుశ్రీ జైపాల్‌రెడ్డి, భిక్షపతి భార్యల మధ్య పోటీ
- బీజేపీలో కనిపించని సందడి

★(రాంబాబు)★
(జోగిపేట-సిరి న్యూస్)

సంగారెడ్డి జిల్లా అందోలు అసెంబ్లీ నియోజకవర్గంలో రాజకీయ పార్టీల కేడర్‌కు నియోజకవర్గాల పునర్విభజన ఫీవర్ పట్టుకుంది. 1952లో ఏర్పడిన ఈ నియోజకవర్గం 1967 వరకు జనరల్ స్థానంగా కొనసాగగా, 1967 నుంచి ఎస్సీ రిజర్వుడుగా మారింది. అప్పట్లో 1967, 1972, 1978 ఎన్నికల్లో దివంగత సీ.రాజనర్సింహ ఇక్కడి నుంచి వరుసగా గెలుపొందారు. ఆ తర్వాత 2008లో పునర్విభజన జరిగి రాయికోడ్, టేక్మాల్, అల్లాదుర్గం మండలాలు చేరినప్పటికీ అందోలు ఎస్సీ రిజర్వుడ్‌గానే కొనసాగింది. అయితే రాబోయే రోజుల్లో దేశవ్యాప్తంగా నియోజకవర్గాల పునర్విభజన జరిగే అవకాశాలు ఉన్నాయన్న ప్రచారంతో అందోలు రెండుగా చీలిపోయే అవకాశం ఉందనే చర్చ జోరందుకుంది. అందోలు నియోజకవర్గం జనరల్ లేదా జనరల్ మహిళగా మారి, అల్లాదుర్గం లేదా ఝరాసంగం ప్రాంతాల్లో మరొకటి ఎస్సీ రిజర్వుడు కావచ్చన్న ఊహాగానాలతో స్థానిక రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి.

# పెద్ద శంకరంపేట పశు వైద్యశాలకు మహర్దశ

- పరిశీలించిన పశు వైద్య అధికారిణి మౌనిక, కాంగ్రెస్ నేత మురళి పంతులు
- వెంటనే మరమ్మతు పనులు ప్రారంభం




**పెద్ద శంకరంపేట, సెప్టెంబర్ 28 (సిరి న్యూస్): పెద్ద శంకరంపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ పశు వైద్యశాల దుస్థితిపై సిరి న్యూస్ దిన పత్రికలో ఈనెల 26న తేదీన ప్రత్యేక కథానానికి ప్రజా ప్రతినిధులు, అధికారుల్లో స్పందన వచ్చింది. ఎవరూ పట్టించుకోని వేళ, పట్టణ కాంగ్రెస్ నేత అసూరి మురళీ పంతులు, పట్టణ పశు వైద్య అధికారిణి మౌనిక లు ఆసుపత్రి ని సందర్శించారు. శిథిలావస్థకు చేరి మూత్రశాలగా మారిన పశు వైద్యశాలను బాగు చేసేందుకు స్థానిక పశు వైద్యశాల అధికారిణి మౌనిక, మురళి పంతులు ముందుకు రావడం పట్ల మండల రైతాంగం హర్షం వ్యక్తం చేస్తోంది.**

### ఏళ్ల తరబడి నిర్లక్ష్యం – దయనీయంగా భవనం

పెద్ద శంకరంపేట మండలంలో దాదాపు 20 వేలకు పైగా పశువులు ఉన్నాయి. ఇక్కడి రైతులకు పాడి పరిశ్రమే ప్రధాన ఆదాయ వనరు. అలాంటి మండల కేంద్రంలో ఉన్న ఏకైక పశు వైద్యశాల గత కొన్నేళ్లుగా అధికారుల నిర్లక్ష్యానికి గురైంది. భవనం పైకప్పు పెచ్చులూడి, గోడలకు రంగులు వెలిసి, తలుపులు, కిటికీలు విరిగి పోయి ఉన్నాయి. ఆవరణం మొత్తం పిచ్చి మొక్కలు, ముళ్ల కంపలతో నిండి పోయింది. లోపల మందులు లేవు, కనీసం కూర్చోవడానికి కుర్చీ కూడా లేదు. దీంతో ఈ భవనాన్ని రాత్రి వేళల్లో తాగుబోతులు మూత్రశాలగా, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మార్చుకున్నారు. పగటి పూట కూడా పశువులను తీసుకు రావాలంటే రైతులు భయపడే పరిస్థితి నెలకొంది. ఈ విషయాలన్నీ వివరిస్తూ ఈ నెల 26 వ తేదీన *సిరి న్యూస్* లో ప్రత్యేక కథనం ప్రచురితమైంది.

### రైతుల ఆవేదన – పడుతున్న ఇబ్బందులు

పశువులకు సీజనల్ వ్యాధులు, చర్మ వ్యాధులు, కృత్రిమ గర్భధారణ, టీకాలు వేయించడానికి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. స్థానికంగా వైద్యం అందకపోవడంతో ప్రైవేటు డాక్టర్లను పిలిచి రూ.1000 నుండి రూ.2000 వరకు ఖర్చు చేయాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. కొందరు రైతులు తమ పశువులను 15 కిలోమీటర్ల దూరంలోని రామాయంపేట, మెదక్ తీసుకెళ్లాల్సి వస్తోంది. ప్రభుత్వం కోట్ల రూపాయలతో నిర్మించిన భవనాన్ని ఇలా వదిలేయడం సరికాదని రైతు సంఘం నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ దుస్థితిపై ఎవరూ పట్టించుకోకపోవడంతో విషయాన్ని స్థానిక పశు వైద్యశాల అధికారిణి మౌనిక, పత్రిక క్లిప్పింగ్స్ తో స్థానిక కాంగ్రెస్ నేత మురళి పంతులు దృష్టికి తీసుకెళ్లారు. పరిస్థితిని వివరించి ఫోటోలు, వార్త చూపించగా, వెంటనే స్పందించిన మురళి పంతులు స్వయంగా క్షేత్ర స్థాయికి వచ్చి భవనాన్ని, చుట్టూ ఉన్న ఆవరణను పరిశీలించారు. "ఇది చాలా దారుణమైన పరిస్థితి. రైతులకు సేవ చేయాల్సిన ఆసుపత్రి ఇలా ఉండటం బాధాకరం. దీన్ని వెంటనే బాగు చేస్తాను" అని ఆయన హామీ ఇచ్చారు.

### వెంటనే మరమ్మతు పనులు ప్రారంభం

ఈ హామీ కేవలం మాటలకే పరిమితం కాలేదు. ఇదే రోజు నుండి మరమ్మతు పనులు ప్రారంభించారు. మొదటగా ఆవరణలో ఉన్న పిచ్చి మొక్కలను తొలగించడం, భవనం చుట్టూ ఉన్న చెత్తను శుభ్రం చేయడం, లోపల ఉన్న పాత సామాన్లను తొలగించడం వంటి పనులు చేపట్టారు. త్వరలోనే భవనానికి నూతన రంగులు వేసి, విద్యుత్ సౌకర్యం కల్పించి, అవసరమైన మందులు, పరికరాలు అందుబాటులో ఉంచుతామని ఆయన తెలిపారు. రోజూ ఒక పశు వైద్యుడు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. మురళి పంతులు తక్షణ స్పందన పట్ల పెద్ద శంకరంపేట మండల రైతులు, ప్రజలు, పాడి రైతులు హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు.



# దివ్యాంగుడిని పట్టించుకునే నాథుడే లేడా?

- పాఠశాలకు వెళ్లేందుకు నానమ్మే ఆసరా
- పుట్టుకతోనే రెండు కాళ్లు పనిచేయలేదు
- రవాణా సౌకర్యం లేక ప్రతి రోజు అవస్థలు
- బ్యాటరీ ట్రైసైకిల్ అందించాలని వేడుకోలు



**రామాయంపేట, సెప్టెంబర్ 28 (సిరిన్యూస్):** పుట్టుకతోనే రెండు కాళ్లు పనిచేయని దివ్యాంగ బాలుడు చదువుపై ఉన్న ఆసక్తితో ఎన్నో ఇబ్బందులను అధిగమిస్తూ పాఠశాలకు వెళ్తున్నాడు. అయితే స్వయంగా పాఠశాలకు వెళ్లేందుకు అవసరమైన రవాణా సౌకర్యం లేకపోవడంతో ప్రతిరోజూ అవస్థలు పడుతున్నాడు. మెదక్ జిల్లా రామాయంపేట మండలం కోనాపూర్ గ్రామానికి చెందిన మనీష్‌రెడ్డి పుట్టుకతోనే దివ్యాంగుడు. ప్రస్తుతం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. రెండు కాళ్లు పనిచేయకపోవడంతో పాఠశాలకు వెళ్లడం అతనికి ప్రతిరోజూ సవాలుగా మారింది.

### నానమ్మే ప్రతిరోజూ ఆసరా

మనీష్‌రెడ్డిని పాఠశాలకు తీసుకెళ్లేందుకు కుటుంబ సభ్యులు చిన్న సైకిల్‌ను అవసరానికి అనుగుణంగా మార్పులు చేసి వినియోగిస్తున్నారు. ప్రతిరోజూ అతని నానమ్మ ఆ సైకిల్‌పై బాలుడిని పాఠశాలకు తీసుకెళ్తోంది. కుటుంబ సభ్యులు అందుబాటులో లేని రోజుల్లో స్నేహితుల సహాయంతో పాఠశాలకు వెళ్లాల్సి వస్తోందని కుటుంబ సభ్యులు తెలిపారు.

### బ్యాటరీ ట్రైసైకిల్ ఉంటే స్వయంగా వెళ్లే అవకాశం

ప్రభుత్వం దివ్యాంగుల కోసం పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నప్పటికీ, తనకు ఇప్పటివరకు అవసరమైన సహాయం అందలేదని మనీష్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. బ్యాటరీతో నడిచే ట్రైసైకిల్ అందిస్తే స్వయంగా పాఠశాలకు వెళ్లగలనని చెబుతున్నాడు. ప్రస్తుతం పదో తరగతి చదువుతున్న మనీష్‌రెడ్డి భవిష్యత్తులో ఇంటర్మీడియట్ విద్యను కొనసాగించాలంటే రామాయంపేటకు వెళ్లాల్సి ఉంటుంది. దీంతో రవాణా సౌకర్యం మరింత కీలకంగా మారనుంది.



### ప్రభుత్వం స్పందించాలని విజ్ఞప్తి

చదువుపై ఆసక్తి ఉన్న మనీష్‌రెడ్డికి ప్రభుత్వం, సంబంధిత అధికారులు స్పందించి బ్యాటరీ ట్రైసైకిల్ అందించి విద్యాభ్యాసానికి అండగా నిలవాలని కుటుంబ సభ్యులు, స్థానికులు కోరుతున్నారు. చిన్న సహాయం అతని చదువుకు, స్వావలంబనకు ఎంతో ఉపయోగపడుతుందని వారు పేర్కొంటున్నారు.










# 'అందోలు'లో పునర్విభజన ఫీవర్!

## నియోజకవర్గంలో మారుతున్న రాజకీయ సమీకరణలు

## 1967 నుంచి ఎస్సీ రిజర్వ్‌డ్‌గానే కొనసాగుతున్న అందోలు స్థానం.. రెండుగా చీలే అవకాశం..







- అందోలు జనరల్, అల్లాదుర్గం ఎస్సీ రిజర్వుడు?
- కాంగ్రెస్‌లో మంత్రి దామోదర రాజనర్సింహ కుటుంబానికే తొలి ప్రాధాన్యత
- జనరల్ మహిళ అయితే త్రిష దామోదర్ బరిలో నిలిచే ఛాన్స్?
- బీఆర్ఎస్‌లో టికెట్ కోసం జైపాల్‌రెడ్డి, భిక్షపతి, నారాయణ ముదిరాజ్ ఆశలు
- హరీష్‌రావు, కేటీఆర్, కేసీఆర్ ఆశీస్సులంటూ ఎవరికి వారు ప్రచారం
- జనరల్ అయితే నేనెందుకు పోటీ చేయకూడదంటున్న క్రాంతికిరణ్
- మహిళా కోటా వస్తే మంజుశ్రీ జైపాల్‌రెడ్డి, భిక్షపతి భార్యల మధ్య పోటీ
- బీజేపీలో కనిపించని సందడి




★(రాంబాబు)★
(జోగిపేట-సిరి న్యూస్)

సంగారెడ్డి జిల్లా అందోలు అసెంబ్లీ నియోజకవర్గంలో రాజకీయ పార్టీల కేడర్‌కు నియోజకవర్గాల పునర్విభజన ఫీవర్ పట్టుకుంది. 1952లో ఏర్పడిన ఈ నియోజకవర్గం 1967 వరకు జనరల్ స్థానంగా కొనసాగగా, 1967 నుంచి ఎస్సీ రిజర్వుడుగా మారింది. అప్పట్లో 1967, 1972, 1978 ఎన్నికల్లో దివంగత సీ.రాజనర్సింహ ఇక్కడి నుంచి వరుసగా గెలుపొందారు. ఆ తర్వాత 2008లో పునర్విభజన జరిగి రాయికోడ్, టేక్మాల్, అల్లాదుర్గం మండలాలు చేరినప్పటికీ అందోలు ఎస్సీ రిజర్వ్‌డ్‌గానే కొనసాగింది. అయితే రాబోయే రోజుల్లో దేశవ్యాప్తంగా నియోజకవర్గాల పునర్విభజన జరిగే అవకాశాలు ఉన్నాయన్న ప్రచారంతో అందోలు రెండుగా చీలిపోయే అవకాశం ఉందనే చర్చ జోరందుకుంది. అందోలు నియోజకవర్గం జనరల్ లేదా జనరల్ మహిళగా మారి, అల్లాదుర్గం లేదా ఝురాసంగం ప్రాంతాల్లో మరొకటి ఎస్సీ రిజర్వుడు కావచ్చన్న ఊహాగానాలతో స్థానిక రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి.

### కాంగ్రెస్‌లో అభ్యర్థి ఎవరు?

ఒకవేళ అందోలు స్థానం జనరల్ లేదా జనరల్ మహిళగా మారితే అధికార కాంగ్రెస్ పార్టీ నుంచి అభ్యర్థి ఎవరన్నది పార్టీ శ్రేణుల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుతం ఈ నియోజకవర్గానికి కాంగ్రెస్ సీనియర్ నేత, రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. సుదీర్ఘకాలంగా ఈ ప్రాంత రాజకీయాలను శాసిస్తున్న కుటుంబం కావడంతో ఆయన ఆమోదించిన వారికే టికెట్ దక్కే అవకాశాలున్నాయి. నియోజకవర్గం జనరల్ అయితే దామోదర రాజనర్సింహనే బరిలో ఉంటారని, ఒకవేళ జనరల్ మహిళకు రిజర్వు అయితే ఆయన కుమార్తె త్రిష దామోదర్‌ను బరిలోకి దింపుతారని కాంగ్రెస్ వర్గాల్లో విస్తృత ప్రచారం జరుగుతోంది. నియోజకవర్గంలో ఎమ్మెల్యే స్థాయికి ఎదిగిన ఇతర సీనియర్లు లేకపోవడం, మండల స్థాయి నేతలే ఉండటంతో మంత్రి కుటుంబానికే పూర్తి పట్టుంది. మహిళా కోటా వస్తే అందోలు మండలానికి చెందిన ఒక ముఖ్య నేత భార్య పేరు కూడా పరిశీలనకు రావచ్చని చర్చించుకుంటున్నా, మంత్రి దామోదర మాత్రం ఈ పునర్విభజన అంశంపై ఇప్పటివరకు ఎలాంటి బహిరంగ ప్రకటన చేయకపోవడం గమనార్హం.

### బీఆర్ఎస్‌లో ఊపందుకున్న లాబీయింగ్..

రిజర్వేషన్ తప్పకుండా మారుతుందన్న పూర్తి ధీమాతో బీఆర్ఎస్ నాయకులు ఒక అడుగు ముందుకేసి క్షేత్రస్థాయిలో విడివిడిగా వ్యక్తిగత ప్రచారాలు మొదలుపెట్టారు. నియోజకవర్గం జనరల్ అయితే తమకే అవకాశం దక్కుతుందని డీసీసీబీ మాజీ వైస్ చైర్మన్ పి.జైపాల్‌రెడ్డి, మాజీ కార్పొరేషన్ చైర్మన్ బిక్షపతి, మాజీ జడ్పీటీసీ పి.నారాయణ ముదిరాజ్‌లు పోటాపోటీగా గ్రౌండ్‌వర్క్ చేసుకుంటున్నారు. తమకు మాజీ మంత్రులు కేటీఆర్, హరీష‌ర◌ావుల సంపూర్ణ సహకారం ఉందని బిక్షపతి ప్రచారం చేసుకుంటుండగా, అధినేత కేసీఆరే స్వయంగా తన అభ్యర్థిత్వాన్ని ఖరారు చేశారని జైపాల్‌రెడ్డి చెప్పుకుంటున్నారు. మరోవైపు జనరల్ అయితే తాను కూడా పోటీలో ఉంటానని మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ సైతం అంతర్గత సంభాషణల్లో స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. మునిపల్లి మండలానికి చెందిన సాయికుమార్ కూడా పోటీకి ఆసక్తి చూపుతున్నారు.

### మహిళా రిజర్వేషన్ వస్తే..

ఒకవేళ అందోలు స్థానం మహిళలకు రిజర్వు అయితే బీఆర్ఎస్ నుంచి టికెట్ దక్కించుకునేందుకు నాయకులు తమ కుటుంబ సభ్యులను సిద్ధం చేస్తున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లా జడ్పీ మాజీ చైర్‌పర్సన్ మంజుశ్రీ జైపాల్‌రెడ్డికి బలమైన అవకాశాలున్నాయని ప్రచారం సాగుతుండగా, మరోవైపు బిక్షపతి సైతం తన భార్యను రాజకీయ బరిలోకి దించేందుకు ప్రణాళికలు రచిస్తున్నారు. ప్రస్తుతం ఉద్యోగం చేస్తున్న ఆమెకు నియోజకవర్గ పరిపాలన, ప్రజా సమస్యలపై పూర్తి అవగాహన కల్పించేందుకు ప్రత్యేకంగా రాజకీయ శిక్షణ ఇప్పిస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. దీంతో మహిళా రిజర్వేషన్ ఖరారైతే గులాబీ గూటిలో పోటీ మరింత రసవత్తరంగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి.

### బీజేపీలో కనిపించని సందడి..

అందోలులో భారతీయ జనతా పార్టీ క్షేత్రస్థాయి ప్రభావం పెద్దగా కనిపించనప్పటికీ, గత పార్లమెంట్ ఎన్నికల్లో నియోజకవర్గంలో గణనీయమైన ఓట్లను రాబట్టుకుంది. అయితే మున్సిపల్ ఎన్నికల్లో ఒక్క సీటు కూడా గెలవలేకపోవడం, నియోజకవర్గ స్థాయి నాయకత్వ కొరత పార్టీని వెంటాడుతోంది. ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు ఇప్పటివరకు ఎవరూ ధైర్యంగా ముందుకు రాలేదు. ప్రస్తుతం బీజేపీ రాష్ట్ర నాయకుడు అనంతరావు కులకర్ణి పేరు మాత్రమే ప్రచారంలో ఉంది. నియోజకవర్గానికి పూర్తిస్థాయి కన్వీనర్ లేదా ఇన్‌ఛార్జ్ కూడా లేకపోవడం గమనార్హం. 2018, 2023 ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి చెందిన మాజీ మంత్రి బాబూమోహన్ ప్రస్తుతం పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉంటున్నారు. దీంతో వచ్చే ఎన్నికల్లో కూడా బీజేపీ బయటి నియోజకవర్గాల నుంచే అభ్యర్థిని దిగుమతి చేసుకునే పరిస్థితి కనిపిస్తోందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.




# 'రియల్' మాఫియా.. అధికారుల మాయ!

## ఇసితాబాద్ వెంచర్లో నిధుల మాయాజాలం

- అభివృద్ధి శూన్యం.. మార్టిగేజ్ ప్లాట్లు రిలీజ్ ఎలా?
- కోట్ల విలువైన ఆస్తి చేజార్చిన పంచాయతీ
- రహదారులు, వాటర్ ట్యాంక్, డ్రైనేజీ లేకున్నా ఫైనల్ అనుమతులు
- బెటర్‌మెంట్, డెవలప్‌మెంట్ చార్జీల వసూళ్లపై స్పష్టత కరవు
- సీసీ కెమెరాలకు రూ.20 వేలు లేవన్న పంచాయతీ
- ప్రత్యేక అధికారి పాలనలోనే కీలక సంతకాలంటూ ఫిర్యాదులు
- షోకాజ్ నోటీసులతో చేతులు దులుపుకుంటున్న అధికారులు
- సర్పంచ్, కార్యదర్శి, డీటీసీపీ అధికారుల పాత్రపై విచారణకు డిమాండ్

సదాశివపేట, సెప్టెంబర్ 28 (సిరిన్యూస్)

**సదాశివపేట మండలం ఇసితాబాద్ గ్రామ పంచాయతీ పరిధిలోని భారీ వెంచర్‌కు సంబంధించి మార్టిగేజ్ ప్లాట్ల విడుదల వ్యవహారం రోజురోజుకూ పెను దుమారం రేపుతోంది. పంచాయతీరాజ్, డీటీసీపీ నిబంధనల ప్రకారం వెంచర్ పరిధిలో వంద శాతం మౌలిక అభివృద్ధి పనులు పూర్తి చేసి, ఉన్నతాధికారుల నుంచి తుది ఆమోదం పొందిన తర్వాతే గ్రామ పంచాయతీ ఆధీనంలో ఉన్న మార్టిగేజ్ ప్లాట్లను విడుదల చేయాల్సి ఉంటుంది. కానీ ఇసితాబాద్‌లో కనీస అభివృద్ధి పనులు చేపట్టకుండానే కోట్ల రూపాయల విలువైన ప్లాట్లను విడుదల చేసేశారంటూ స్థానిక గ్రామస్తులు, ఫిర్యాదుదారులు తీవ్రస్థాయిలో మండిపడుతున్నారు. లేఅవుట్‌లో అంతర్గత బీటీ లేదా సీసీ రహదారులు, ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంక్, భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ, వీధి దీపాలు, తాగునీటి సరఫరా వంటి కనీస వసతులు క్షేత్రస్థాయిలో దర్శనమివ్వడం లేదని, అయినా అధికారులు గుట్టుచప్పుడు కాకుండా ప్లాట్లను ఎలా క్లియర్ చేశారని నిలదీస్తున్నారు.**

### కోట్ల విలువైన గ్రామ ఆస్తి చేజారిందా?

నిబంధనల ప్రకారం లేఅవుట్ నిర్వాహకులు ఇచ్చిన గడువులోగా అభివృద్ధి పనులు పూర్తి చేయడంలో విఫలమైతే.. గ్రామ పంచాయతీ వద్ద రక్షణగా ఉన్న ప్లాట్లను వేలం వేసి, లేదా తన ఆధీనంలోకి తీసుకుని, ఆ నిధులతో స్వయంగా రోడ్లు, వాటర్ ట్యాంక్, డ్రైనేజీ తదితర పనులను పూర్తి చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం సదరు వెంచర్‌లోని మార్టేగ్జ్ ప్లాట్ల బహిరంగ మార్కెట్ విలువ కోట్ల రూపాయల్లో పలుకుతోంది. ఇంతటి విలువైన ప్లాట్లను గ్రామ పంచాయతీ తన నియంత్రణలో ఉంచుకుని ఉంటే పంచాయతీకి భారీగా స్థిరాస్తి లేదా శాశ్వత నిధులు సమకూరేవని ఫిర్యాదుదారులు వాదిస్తున్నారు. కానీ అధికారుల ఉదాసీనత, చేతివాటం వల్ల కోట్ల రూపాయల విలువైన ఆస్తులు ప్రైవేట్ వ్యక్తుల పరమయ్యాయని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### డెవలప్‌మెంట్ చార్జీలు ఏవి?

ఎకరాల కొద్దీ విస్తీర్ణంలో వేసిన భారీ లేఅవుట్ నుంచి గ్రామ పంచాయతీ ఖజానాకు రావాల్సిన బెటర్‌మెంట్ చార్జీలు, డెవలప్‌మెంట్ ఫీజులు, లేఅవుట్ పరిశీలన రుసుములు ఎంత మేర వసూలయ్యాయో శ్వేతపత్రం విడుదల చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. గ్రామంలో ఒక పేదవాడు లేదా సామాన్యుడు చిన్న ఇల్లు కట్టుకోవాలన్నా వేలాది రూపాయల అనుమతి ఫీజులు వసూలు చేస్తున్న పంచాయతీ అధికారులు.. కోట్లలో వ్యాపారం చేసే వెంచర్ల నుంచి రావాల్సిన చట్టబద్ధమైన ఆదాయాన్ని ఎందుకు రాబట్టలేకపోయారని ప్రశ్నిస్తున్నారు. గ్రామంలో శాంతిభద్రతల రక్షణ కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని గ్రామసభలో తీర్మానించినప్పుడు పంచాయతీ వద్ద కనీసం రూ.20 వేల నిధులు కూడా లేవు అని పాలకులు చేతులెత్తేయడం విడ్డూరంగా ఉందని గుర్తుచేస్తున్నారు. లక్షలాది రూపాయల ఆదాయం సమకూరాల్సిన వెంచర్ల నుంచి నిధులు రాబట్టకుండా, అత్యవసర పనులకు నిధులు లేవని చెప్పడం వెనుక ఉన్న మతలబేమిటని మండిపడుతున్నారు.

### నోటీసుతో సరిపెడతారా?

ఈ మార్టిగేజ్ ప్లాట్ల విడుదల వ్యవహారమంతా స్పెషల్ ఆఫీసర్ పాలన కొనసాగుతున్న సమయంలోనే సాగిందన్న ఆరోపణలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ప్రత్యేక అధికారి ఆదేశాలతోనే విడుదల చేశామని కిందిస్థాయి సిబ్బంది చెబుతుండగా.. అసలు నిధులు జమ కాకుండా, క్షేత్రస్థాయి తనిఖీలు లేకుండా కేవలం ఒకటి రెండు సంతకాలతో కోట్ల విలువైన ఫైళ్లను ఎలా ఆమోదించారన్నది మిస్టరీగా మారింది. గతంలో ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు క్షేత్రస్థాయి విచారణ జరిపి, బాధ్యులైన సిబ్బందికి నామమాత్రపు షోకాజ్ నోటీసులు జారీ చేసి వదిలేశారని తెలుస్తోంది. కేవలం నోటీసులతో కాలయాపన చేసి చేతులు దులుపుకుంటే సరిపోదని, పంచాయతీ ఖజానాకు జరిగిన ఆర్థిక నష్టాన్ని ఎవరు భర్తీ చేస్తారని ఫిర్యాదుదారులు నిలదీస్తున్నారు. గ్రామ పంచాయతీల్లో ప్రజాప్రతినిధుల పదవీకాలం పరిమితమే అయినా, ప్రభుత్వ ఉద్యోగిగా ఉండే పంచాయతీ కార్యదర్శి ప్రజల ఆస్తులు, ఆదాయం, రికార్డుల పరిరక్షణలో పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుంది. ప్రజల పన్నులతో జీతాలు పొందుతూ నిబంధనలకు తిలోదకాలు ఇచ్చిన అధికారులపై శాఖాపరమైన, క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ అవినీతిలో పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్ పాత్రతో పాటు డీటీసీపీ, పంచాయతీరాజ్ డివిజనల్ అధికారుల పాత్రపైనా సమగ్ర నిఘా విచారణ జరపాలని కోరుతున్నారు.

# అక్రమ క్రషర్లపై కలెక్టర్‌కు ఫిర్యాదు!

- దుమ్ము ధూళితో రోగాల బారిన జనం
- కలెక్టర్కు గ్రామస్తుల మొర
- బాధ్యులపై చర్యలకు డిమాండ్
- గ్రామాలను మింగేస్తున్న క్రషర్ల ధుమ్ము
- పేలుళ్లకు బీటలు వారుతున్న ఇళ్లు

క్రషర్లతో దెబ్బతింటున్న ఇండ్లు
సిరి కథనంతో కలెక్టర్కు ఫిర్యాదు చేసిన గ్రామస్తులు



**జిన్నారం, సెప్టెంబర్ 28 (సిరి న్యూస్)** సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలం మాదారం గ్రామ సమీపంలో నిబంధనలకు విరుద్ధంగా స్టోన్ క్రషర్లు,కంకర క్వారీ మైనింగ్ లతో ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. ప్రజల ప్రాణాలతో చెలగాట మాడుతున్నారు. అక్రమ కార్యకలాపాలు పర్యావరణ శాఖ మైనింగ్ నిబంధనల ప్రకారం జనావాసాలకు వ్యవసాయ భూములకు నిర్ణీత దూరంలో మాత్రమే క్రషర్లు ఏర్పాటు చేయాలి కానీ నిర్వాహకులు ఎటువంటి నిబంధనలు పాటించకుండా గ్రామానికి దగ్గర్లోనే పనులు కొనసాగిస్తున్నారు.

### భారీ పేలుళ్లు – ఇళ్ల విధ్వంసం..

రాత్రి పగలు అనే తేడా లేకుండా, స్టోన్ క్రషర్ల లో విపరీతమైన పేలుళ్లు మందు గుండులతో (బ్లాస్టింగులు) జరుపుతున్నారు. ఈ దాటికి భూమి కంపించి ఇళ్ల గోడలు భవనాలు తీవ్రంగా బీటలు వారుతున్నాయి. దీంతో ఏ క్షణంలో ఇల్లు కూలిపోతాయోనని గ్రామస్తులు భయాందోళనతో గడుపుతున్నారు. స్టోన్ క్రషర్ల నుంచి వచ్చే విపరీతమైన సీమంతపు దుమ్ము స్టోన్ డస్ట్ గ్రామాన్ని ముంచెత్తుతుంది. గాలి కలుషితమై పిల్లలు వృద్ధులు శ్వాసకోశ సమస్యలు అస్తమ కంటి వ్యాధులు మరియు చర్మ రోగాల బారిన పడుతున్నారు. పొలాలపై దుమ్ము పేరుకుపోవడంతో పంట దిగుబడి పూర్తిగా తగ్గిపోయి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. అంతేకాకుండా పేలుళ్ల వల్ల భూగర్భ జలాలు అట్టడుగుకు పోయి తాగునీటి బావులు బోర్లు ఎండిపోతున్నాయి.






### కలెక్టర్ స్పందనపై ఆశలు..

ప్రజల ప్రాణాలతో ఆస్తులతో చెలగాటమాడుతున్న క్రషర్ స్టోన్ నిర్వాకులపై తక్షణమే విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు జిల్లా కలెక్టర్కు వినతిపత్రం ఇచ్చారు అధికారులు స్పందించకపోతే గ్రామస్తులందరూ కలిసి పెద్ద ఎత్తున ఆందోళన దిగుతామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా దువ్వగుంట గ్రామస్తులు పెద్ద మల్లేష్ మాట్లాడుతూ రాత్రి వేళల్లో కూడా భారీ శబ్దాలతో బ్లాస్టింగ్లు చేస్తుండటంతో చిన్నారులు వృద్ధులు భయంతో నిద్రలేక పోతున్నారు. ఎప్పుడు ఇల్లు కూలి నెత్తిమీద పడుతుందోనని ప్రతిక్షణం చావు గుప్పిట్లో బ్రతుకుతున్నామని తెలిపారు. పాఠశాల పిల్లల చదువులకు విఘాతం కలుగుతుంది, క్రషర్ల శబ్దాలు రోడ్లపై వేగంగా వెళ్లే లారీల దాటికి స్థానిక పాఠశాలలో విద్యార్థులు సరిగ్గా చదువుకోలేకపోతున్నారు. క్రషర్ల దుమ్ము స్కూల్ ఆవరణను కమ్మేస్తుండటంతో పిల్లలను బడికి పంపాలంటే భయమేస్తుందన్నారు. మైనింగ్ అధికారులు నెల నెల అందుతున్న ముడుపులకు ఆశపడి అక్రమ క్రషర్ల వైపు కన్నెత్తి కూడా చూడటం లేదు అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో మాదారం సీతారాం యాదవ్, మల్లేష్, కుమార్, భజరంగ్ సింగ్, నరసింహా, గణేష్, చంద్రయ్య ఉన్నారు.

# యోషిత సుప్రీమ్ జోన్ వెంచర్‌పై విచారణ జరపాలి

- పంచాయతీ ఆదాయానికి భారీగా గండి
- మౌలిక వసతులు కల్పించకుండా, అక్రమంగా ప్రహరీ గోడ నిర్మాణం
- ఎండీ అహ్మద్, ఎండీ అబ్దుల్ రఫీ డిమాండ్
- ఇసితాబాద్ వెంచర్‌లో నిబంధనల ఉల్లంఘనపై ఎంపీడీవోకు ఫిర్యాదు
- కలెక్టర్, ఇరిగేషన్, డీటీసీపీ ఎన్ఓసీలపై పరిశీలనకు విజ్ఞప్తి

ఫైనల్ లే అవుట్ రాకముందే మార్టిగేజ్ విడుదల



**సదాశివపేట, సెప్టెంబర్ 27 (సిరి న్యూస్):** సదాశివపేట మండలం ఇసితాబాద్ గ్రామ పంచాయతీ పరిధిలోని యోషిత సుప్రీమ్ జోన్ వెంచర్ వ్యవహారంలో భారీగా నిబంధనలు ఉల్లంఘించారంటూ వస్తున్న ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎండీ అహ్మద్, ఎండీ అబ్దుల్ రఫీ మండల పరిషత్ అభివృద్ధి అధికారికి అధికారికంగా ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుదారుల వివరాల ప్రకారం.. యోషిత సుప్రీమ్ జోన్ వెంచర్ యాజమాన్యం సుమారు 10.17 గుంటల విస్తీర్ణానికి టి.ఎల్.పీ. నం.346/2022/హెచ్ ను చూపిస్తూ ప్లాట్లను విక్రయించింది. సదాశివపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో డాక్యుమెంట్ నం. 11927/2022 ద్వారా ఇసితాబాద్ గ్రామ పంచాయతీకి భూమిని మార్టిగేజ్ చేసినట్లు తెలిపారు. అయితే, ఫైనల్ లే అవుట్ అప్రూవల్ రాకముందే నిబంధనలకు విరుద్ధంగా మార్టిగేజ్ విడుదల చేసుకున్నారని ఆరోపించారు. సదాశివపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో డాక్యుమెంట్ నం. 1435/2025 ద్వారా మార్టిగేజ్ విడుదల చేసినట్లు పేర్కొంటూ, విచారణ జరపాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా గ్రామ పంచాయతీకి రావాల్సిన ఆదాయానికి తీవ్ర నష్టం కలిగే విధంగా ఈ వెంచర్ వ్యవహారాలు సాగాయని ఫిర్యాదుదారులు మండిపడ్డారు. వెంచర్‌లో నిబంధనల ప్రకారం రోడ్లు, మురుగునీటి కాలువలు, మంచినీటి ట్యాంకు వంటి కనీస మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయలేదని, పైగా నిబంధనలకు విరుద్ధంగా ప్రహరీ గోడ నిర్మించారని ఆరోపించారు. వెంచర్‌కు సంబంధించి కలెక్టర్ ఎన్ఓసీ, ఇరిగేషన్ శాఖ ఎన్ఓసీ, డీటీసీపీ ఎన్ఓసీ తదితర అనుమతులపై సమగ్ర విచారణ జరపాలని కోరారు. సర్వే నం.67లో 2.18 గుంటల విస్తీర్ణానికి డీటీసీపీ లే అవుట్ అనుమతి ఇచ్చిన అంశాన్ని కూడా పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. డీటీసీపీ నిబంధనలకు సంబంధించిన లెటర్ నం.20513/1170/2022/హెచ్/ఈ లోని అంశాలను పరిగణలోకి తీసుకోవాలని కోరారు. ఇసితాబాద్ గ్రామ పంచాయతీ కార్యదర్శి కె. నర్సింహులు పాత్రపై కూడా విచారణ జరిపి, తప్పిదాలు రుజువైతే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. యోషిత సుప్రీమ్ జోన్ వెంచర్‌లో ప్రస్తుతం జరుగుతున్న అన్ని రకాల పనులను తక్షణమే నిలిపివేయాలని, మార్టిగేజ్ విడుదల మరియు లే అవుట్ అనుమతులపై సమగ్ర విచారణ చేపట్టాలని వారు కోరారు. ఈ